ENTERED

E

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
17 జూలై, 2011



'అనంత' పద్మనాభుడు

హ్యాపీ బర్త్‌డే

(2011 జులై 17 నుంచి
2011 జులై 23 వరకు)

అరుణి
2సం॥, జులై-21
మంజుల-నారాయణస్వామి
చిలమత్తూరు-అనంతపురం

డి.సోనార్‌బాబు
5సం॥, జులై-2006
శైలజ-విజయభాస్కర్
చీరాల-వైకుంఠపురం

ఆదర్శ్
5సం॥, జులై-20
సీతామహాలక్ష్మి-సత్తిబాబు
రావులపాలెం-తూ॥గో॥

కె.ఎం. పూర్ణిమ
జులై
జయలక్ష్మీదేవి-శ్రీనివాసులు
ఆత్మకూరు-కర్నూలు

బి.రమ్య
6సం॥, జులై-19
పద్మ-వెంకటరెడ్డి
నర్సరావుపేట-గుంటూరు

పి.కళ్యాణి-సాయికుమార్
జులై
ముత్తమ్మ-సైదులు

సిహెచ్. లోహిత్
5సం॥, జులై-19
రాధ-కేశవరావు
రాజోలు-తూ॥గో

టి.శాంతిస్వరూప్
జులై-17
వరలక్ష్మి-లవరాజు
రాజమండ్రి

సాత్విక్
జులై
ప్రణీత-శ్రీనివాస్
జగద్గిరిగుట్ట-హైదరాబాద్

ఎం.శ్రీవైష్ణవి
2సం॥, జులై-17
అరుణ-వెంకటకిరణ్‌కుమార్
సత్తెనపల్లి-గుంటూరు

ENTERED

మనలో మాట

'పన్ను'లు పీకుతున్నారు!



"ఏరా... ధీరులెవ్వరురా! రణసూరులెవ్వరురా... భళా భళి ...ఏరా! ...లోకుల నెత్తిన మొట్టేవాళ్లం... సీమకు మేమే రాజులం... తిండిపోతురాజులం... సాగితే మహరాజులం... చతికిల పడితే తరాజులం... చిన్నా పెద్దా బేధం లేదు... కొర్దీ గొప్పా తేడా లేదు.... ఈ బాటకు సుంకం కట్టు... మా కాళ్లకు దండం పెట్టు... ఇక తిరగేయ్‌రా పెసరట్టు... ఏరా..."

***

"అవును... ఈ ఏడేడు లోకాల్లో ఎక్కడా ఇలాంటి మహారాజులు కనిపించరు. ఈ బాటను మేం సృష్టించాం.. ఈ మొక్కలు మేం మొలిపించాం.. ఈ ద్వారం మేం వేయించాం... పరాక్రమంతో ఆక్రమించాం... పరిపాలన సాగించాం... మహారాజులమయ్యాం... కనక పన్ను కట్టకపోతే... తంతాం..."

'సువర్ణ సుందరి' చిత్రం లోనిదీ పాట. పాతతరం వారికి ఈ సన్నివేశం బాగా ఎరుకే. దాదాపు 54 సంవత్సరాల కిందట వేదాంతం రాఘవయ్యగారి నిర్దేశకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రమిది. ఆ రోజుల్లోనే సామాన్యుల ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్న బాట పన్ను గురించి వ్యంగ్యంగా వెండితెరకెక్కించారు దర్శకులు. రేలంగి-రమణారెడ్డి-బాలకృష్ణ (అంజిగాడు) ఓ అడవి దారికి అడ్డంగా తాడు కట్టి వచ్చేపోయే బాటసారుల దగ్గర పన్ను వసూలు చేస్తుంటారు. కట్టకపోతే తన్ని మరీ లాక్కుంటుంటారు. సరిగ్గా ఆ క్షణంలో అటుగా వస్తాడు చిత్ర కథానాయకుడు నాగేశ్వరరావు. అతణ్ణి కూడా పన్ను కట్టమంటారు. అప్పుడు జరిగే రసవత్తర సన్నివేశమిది. ఆ చిత్రంలో పై ముగ్గురూ ఆవారాగాళ్లు. ఇప్పుడు ఆ ముగ్గురి స్థానంలో ప్రపంచబ్యాంకు, ప్రభుత్వం, ప్రయివేటు బడా కంపెనీలు వచ్చేశాయి. పళ్లూడగొట్టి దారి పన్ను వసూల్ చేస్తున్నాయి.

సువర్ణసుందరి చిత్రం విడుదలయ్యాక ఐదున్నర దశాబ్దాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ నాటి సన్నివేశాలు నేడూ దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు రోడ్లను ముక్కలు ముక్కలు చేసి అమ్మేస్తారని బుద్ధి జీవులంటే నవ్వారు. అక్షరం పొల్లుపోకుండా ఏలికలు ఇప్పుడదే చేస్తున్నారు. ప్రయివేటు పెద్దమనుషుల చేతికి బాటల పగ్గాలందించారు. 'ఆ' దారిన పోయేవారి నెత్తిన మొట్టి మరీ పైకం వసూలు చేస్తున్నారు. ముందు కొన్ని రోడ్లకే ఇది పరిమితమన్నారు. క్రమంగా దాన్ని విస్తరిస్తున్నారు.

మనిషికి నోటి నిండా 'పన్ను'లున్నట్టు ... ఏలికల బుర్రల నిండా కూడా ఎన్నో పన్నులు. వాటిని ఒక్కొక్కటిగా తీసి జనాల నెత్తిన రుద్దడమే వారి పని. వ్యాట్, వినోదం, ఆదాయం... అంటూ రకరకాల పన్నులను బాదుతున్నారు. అవి చాలవన్నట్టు చివరకు రోడ్డుమీద వెళ్లినందుకు కూడా పన్ను పీకుతున్నారు! ★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
ఈ పేజ్	...	6
కవిత్వమ్	...	10
నవ్వుల్ పువ్వుల్	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

అంగ్‌క్రంగ్ అన్నపూర్ణ ... 4

సినిమా కబుర్లు ... 8

సమాంతర చిత్ర స్ఫూర్తి ప్రదాత మణికౌల్

వికాసం ... 20

ఎనీమియా ఎందుకు వస్తుంది?

కొత్త పుస్తకాలు ... 21

మహాయోధుడు అలెండి



హృదయాన్ని హత్తుకుంది

ఈ వారం స్నేహ సంచిక స్నేహపూర్వక స్వాగతం పలికింది. కవర్‌స్టోరీగా వచ్చిన 'పదిహేనుకే పసందైన భోజనం' హృదయాన్ని హత్తుకుంది. ఇలాంటి ఆలోచన రావడం చాలా గొప్ప విషయం. ఆ ఆలోచనను ఆశయంగా చేసుకుని అమలు పరచడం నిజంగా ఆయనలోని మానవత్వానికి, సహృదయతకు అద్దం పట్టింది. ఇంత చక్కని ఆశయాన్ని నిరాటంకంగా కొనసాగిస్తూ ఎంతోమంది క్షుద్బాధను తీరుస్తున్న సుంకర ఆదినారాయణ చాలా గొప్పమనిషి. వారికి హృదయపూర్వక అభినందనలు. నెల్లూరు వెళ్లినప్పుడు వారితో తప్పకుండా మాట్లాడి రావాలనుకుంటున్నాం. ఇంత చక్కని వ్యాసం అందించిన సంపాదక వర్గానికి ధన్యవాదాలు.

టి.వి.డి.ఎన్. సీతారామారావు,
విజయవాడ.

ఆశ్చర్యకరమైన చారిత్రక చిత్రాలు

చూద్దామాలో 'కేతవరంలో ఆదిమానవ దృశ్యం' ఆకట్టుకుంది. ఇక్కడి శిలా చిత్రాలు క్రీస్తు పూర్వం ఆరువేల సంవత్సరాల కిందటి మానవ నాగరికతకు సంబంధించినవని తెలిసి ఆశ్చర్యపోయాం. ఇది కర్నూలు పట్టణానికి బాగా దగ్గరగా ఉందన్న విషయం తెలుసుకుని చాలా సంతోషం వేసింది. పురావస్తు శాఖ నోటీసు బోర్డు తప్ప పరిశోధనకు ప్రత్యేక చర్యలు లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం వీటి కోసం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం వల్ల ఇటువంటి ఎన్నో చారిత్రక నమూనాలు మరుగున పడిపోతున్నాయి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

ఆకట్టుకున్న వ్యాసాలు

పొట్టివాని పిట్ట కథ బాగుంది. 15 రూపాయల భోజనం, 'చోటారాజన్, బడా డాన్' వ్యాసాలు ఆకట్టుకున్నాయి. జీవన విధానంలో కొద్దిపాటి మార్పులు చేసుకుంటే తప్ప అలసటకు కళ్లెం వేయలేమోమేమో! మన తృప్తి కోసం ఏవేవో మందులు వేసుకున్నా అవి తాత్కాలికమే కానీ మంచి ఫలితాన్నివ్వవు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

'నల్ల కలువ' బాగుంది

పదిహేను రూపాయలకే ఆరోగ్యకరమైన కమ్మని భోజనం పెట్టేవారు అన్నదాతతో సమానం. ఆర్. శాంతసుందరి 'నల్లకలువ' కథ బావుంది. 'బాల నేస్తాలు'లో నిశాచరి విశేషాలు తెలుసుకున్నాం. 'కేశబాలిక' గురించి చదివి ఆశ్చర్యపోయాం. 'పొట్టి మనిషి' వ్యాసం ద్వారా కొత్త విషయాన్ని తెలుసుకున్నాం. 'వ్యాయామం ఎందుకు?' వ్యాసం ప్రయోజనకరంగా ఉంది. కవితలు భావగర్భితంగా ఉన్నాయి. 'సినిమా కబుర్లు'ను లోతుగా, విశ్లేషణాత్మకంగా అందించడం బాగుంది. 'వడ' వంటకాలు నోరూరించాయి. కేతవరం ఆదిమానవ దృశ్య కథనాలు అపురూపంగా ఉన్నాయి. 'వికాసం'లో అనేక సైన్స్ సంగతులు తెలుస్తున్నాయి. 'ఈ పేజీలో ఫైర్‌ఫాక్స్ - 5 గురించి అవగాహన కలిగింది. హ్యాపీబర్త్‌డే ఫీచర్లో ముద్దులొలికే చిన్నారుల ఫొటోలతో శుభాకాంక్షలు తెలపడం సంతోషాన్నిస్తుంది. 'మనలోమాట' వివేకానికీ, అవివేకానికీ మధ్యనున్న తేడాను అర్థం చేసుకోడానికి ఉపయోగపడింది. వివేకం...

ఆలోచన... మనిషి చేతిలో పనే.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

అందరికీ అందుబాటులో...

'పదిహేనుకే పసందైన భోజనం' ఆకర్షించింది. ధరలు పెరిగిన నేటి రోజుల్లో చాలీ చాలని జీతాలతో సతమతమౌతున్నాం. అలాంటిది 15 రూపాయలకే అన్నం, పప్పు, కూర, మజ్జిగతో కడుపు నిండా భోజనం పెట్టడమంటే మాటలు కాదు. సుంకర ఆదినారాయణ ఇంత తక్కువ ధరలో సామాన్యులకు రుచికరమైన భోజనం అందించడం శ్లాఘనీయం.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం.



మష్రూమ్ స్వీట్ కార్న్ సూప్

కావలసిన పదార్థాలు

రైస్ స్టాక్ (గంజి) - 3 కప్పులు, మష్రూమ్స్ - 200 గ్రా
స్వీట్ కార్న్ - 1 కప్పు, కార్న్‌ఫ్లోర్ - 1 టేబుల్ స్పూన్
మిరియాలపొడి - అర టీ స్పూన్, అజినమోటో - చిటికెడు
సోయాసాస్ - పావు టీ స్పూన్, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

వానాకాలంలో వేడివేడి తినుబండారాల పైనే పిల్లాపెద్దా మక్కువ చూపుతారు. రుచికరమైన ఈ సూప్‌ని ఎవరైనా ఇష్టపడతారు. మష్రూమ్‌లు నిలువుగా కోసుకోవాలి. ఈ ముక్కలను, స్వీట్‌కార్న్‌ను కలిపి ఉడకబెట్టాలి. తర్వాత వీటిని వడగట్టి పక్కన పెట్టుకోవాలి. గంజిని స్టౌమీద పెట్టి మరుగుతున్నప్పుడు ఉడకబెట్టిన మష్రూమ్ ముక్కలు, స్వీట్ కార్న్ అందులో వేయాలి. అజినమోటో, కార్న్‌ఫ్లోర్ నీళ్లలో కలిపి అందులో వేసి కలపాలి. అంతే మష్రూమ్ స్వీట్ కార్న్ సూప్ రెడీ. తాగేముందు సోయాసాస్ వేసుకుంటే బావుంటుంది.



పొటాటో బాల్స్

కావలసిన పదార్థాలు

బంగాళదుంపలు - 3, క్యారెట్, బీన్స్, క్యాబేజీ తురుము - 1 కప్పు
గుడ్డు - 1, సన్న సేమ్యా - అరకప్పు
నూనె - వేయించడానికి సరిపడా, ఉప్పు - తగినంత

తయారు చేసేవిధానం

క్యారెట్, బీన్స్, క్యాబేజీ తురుములో ఉప్పు కలిపి పెట్టుకోవాలి. బంగాళదుంపలను ఉడికించి ముద్దగా చేసుకుని అందులో ఉప్పు కలుపుకోవాలి. గుడ్డుసొన గిలకొట్టుకుని ఒక బౌల్‌లో ఉంచుకోవాలి. అలాగే సన్న సేమ్యాను ఒక ప్లేట్‌లో ఉంచుకోవాలి. అరచేతికి నూనె రాసుకుని నిమ్మకాయంత బంగాళదుంప ముద్దను తీసుకుని పరుచుకోవాలి. అందులో పైన చెప్పిన కూరగాయల తురుమును ఉంచి మూసివేసి బాల్స్‌లా చేసుకోవాలి. వాటిని గుడ్డుసొనలో దొర్లించి, తరువాత సేమ్యాలో కూడా దొర్లించి నూనెలో వేయించుకోవాలి. బంగారురంగులో వేగిన తరువాత తీసి టిష్యూ పేపర్ ఉంచిన ప్లేట్‌లో వేసుకోవాలి. కరకరలాడుతూ, రుచిగా ఉండే ఈ బాల్స్‌ను టమాటాసాస్‌తో కలిపి చిరుజల్లులు పడుతుండగా తింటుంటే ఆ మజానే వేరు!



సేమ్యా దోశ

కావలసిన పదార్థాలు

సన్న సేమ్యా (షీర్‌కుర్మాకు వాడేది) - 100 గ్రాములు
పాలు - పావులీటరు, మైదా - 2 టేబుల్ స్పూన్లు
గోధుమపిండి - 2 టేబుల్ స్పూన్లు
బొంబాయి రవ్వ - 2 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయ - 1, పచ్చిమిర్చి - 3
జీలకర్ర - 1 టేబుల్ స్పూన్, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

ఒక గిన్నెలో పాలు కాగాక అందులో సేమ్యాను వేసి కలపాలి. అది వెంటనే ఉడికిపోతుంది. అది చల్లారాక దానిలో గోధుమపిండి, మైదా, బొంబాయి రవ్వ, ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, జీలకర్ర, ఉప్పు, నీళు కలిపి రెండు గంటలు నానబెట్టాలి. తరువాత ఆ పిండితో దోశలు వేసుకోవాలి. మామూలు దోశలకన్నా వెరైటీగా ఉన్నాయంటూ పిల్లలు వరుసగా లాగించేస్తారు.

మిక్స్‌డ్ వెజిటబుల్ పికిల్

కావలసిన పదార్థాలు

నిమ్మకాయలు - 6, క్యారెట్ - 2
పచ్చిమిర్చి - 5, ఆవపిండి - 1 టీ స్పూన్
మెంతి పిండి - అర టీ స్పూన్
కారం - 3 టేబుల్ స్పూన్, ఉప్పు - సరిపడా

తయారు చేసే విధానం

నాలుగు నిమ్మకాయలు, క్యారెట్, పచ్చిమిర్చి చిన్న ముక్కలుగా కోసుకోవాలి. ఈ ముక్కల్లో రెండు నిమ్మకాయల రసం పిండాలి. ఈ మిశ్రమంలో మెంతిపిండి, ఆవపిండి, ఉప్పు, కారం కలిపి మూడు రోజులు ఉంచాలి. ఇలా ఉంచడం వల్ల క్యారెట్, నిమ్మ ముక్కలకు ఉప్పు, కారం, పులుపు పట్టి రుచిగా ఉంటాయి.

- కె. అరుణ

లలిత కళల పట్ల మక్కువ చూపనివారుండరు. ఆకర్షణగా మొదలైన ఆసక్తిని అభ్యాసం ద్వారా [illegible] చేసుకుని ఇటు గృహిణిగా, ఇటు కళాకారిణిగా, గురువుగా రాణించిన ఘనత [illegible] అనసూయా కులకర్ణి. అంతటితో ఆగక వివిధ దేశాల్లో విద్యార్థులను [illegible] భిన్న సంగీత రీతులను అభ్యసిస్తున్నారు. అదే సమయంలో 300 సంగీత వాద్యాలు సేకరించడమే కాక, వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ప్రదర్శిస్తున్నారు. ఆ వివరాలు...

అంగ్‌క్లంగ్ అన్నపూర్ణ

300 వాద్యాల సేకరణ



కర్ణాటక సంగీతంలో గాన కళారత్న ఆర్.ఆర్.కేశవమూర్తి శిష్యరికంలో ఓనమాలు దిద్దిన అనసూయ, 1952వ సంవత్సరంలో బెంగుళూరు ఆల్ ఇండియా రేడియోలో గాయనిగా జీవితం ఆరంభించారు. అదే సంవత్సరం చెన్నయ్ మ్యూజిక్ అకాడమీ నుంచి గోల్డ్‌మెడల్ అందుకోవడం విశేషం. ప్రముఖ గురువు మైసూర్ టి.చౌడయ్య వద్ద కూడా కొంతకాలం శిష్యరికం చేశారు. ఆమె గాన మాధుర్యానికి ఆకర్షితులై ప్రముఖ సినీ దర్శకులు సుబ్బయ్య నాయుడు 1961లో 'భక్త ప్రహ్లద' చిత్రానికి నేపథ్య గాయనిగా అవకాశం కల్పించారు.

వివాహానంతరం ఆమెకు భర్తతో పాటు దేశ విదేశాలు తిరిగి చూడడం, అక్కడి సంగీత రీతులు, సంగీత వాద్యాలను తెలుసుకునే అవకాశం లభించింది. అదే ఆమెను సంగీత ప్రపంచానికి మరింత చేరువ చేసింది. 1964లో భర్త ఉద్యోగ రీత్యా కాబూల్‌కు మారడంతో అక్కడి ప్రముఖ సంగీత విద్వాంసుడు ఉస్తాద్ మొహమ్మద్ హుస్సేన్ సరంగ్ శిష్యరికంతో హిందూస్తానీ సంగీతం అభ్యసించే సదవకాశం ఆమెకు దొరికింది. ఉస్తాద్ తన ప్రియ శిష్యురాలికి స్వరమండల్ అనే తంత్రీవాద్యాన్ని కానుకగా ఇచ్చి ఆశీర్వదించారు. సంగీత వాద్యాలను సేకరించాలనే తన ఆలోచనకు నాంది పలికింది గురువుగారు బహూకరించిన ఆ తంత్రీవాద్యమే అంటారు అనసూయ. కాబూల్‌లో కొన్ని ప్రదర్శనలు ఇచ్చారు. ఆ తర్వాత భర్తతో కలిసి బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, కెనడా, కెన్యా, పపువా న్యూ గినియా, ఉగాండా, మంగోలియా, ఇథియోపియా, భూటాన్, ఇండోనేషియా దేశాల్లో పర్యటిస్తూ తన ప్రతిభను చాటుకున్నారు. ప్రదర్శనలకే పరిమితం కాకుండా ఆదేశాలలో ప్రముఖ సంగీత విద్వాంసులతో సత్సంబంధాలు కొనసాగించారు. ఎన్నో యూనివర్శిటీలలో ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద సంగీతం నేర్పించారు. ఇప్పటికే ఆమె పలు దేశాలకు చెందిన తంత్రీ, సుషిర, అవనద్ధ .... వంటి భిన్న సంగీత వాద్యాలను సేకరించారు.

"ప్రతి వాద్యాన్ని జాగ్రత్తగా ఇంటికి తేవడం ఓ ఎత్తైతే దాన్ని పాడవకుండా భద్రపరచడం మరో ఎత్తు. ఇది నిజంగా ఓ సవాలు" అంటారు అనసూయ. ఇండోనేషియాలో ఆమె మొదటిసారిగా అంగ్‌క్లంగ్ ను (వెదురుబొంగులను వరుసక్రమంలో బిగించిన చట్రం. చూడడానికి జైలోఫోన్ (క్రమముక్కల సంగీతపు పెట్టె) మాదిరిగా ఉండే అతిపెద్ద వాద్యం) చూశారు. అది పూర్తిగా ఒక పెద్ద గదిని ఆక్రమించేది. పైగా దానిలో స్వరాలు పలికించడానికి వాద్యకారులు ముందుకు వెనుకకు పరుగెత్తవలసి వచ్చేది. భారతీయ శాస్త్రీయ సంగీతంలో గాయనీ గాయకులు నిలబడడం, పరుగెత్తడం వంటివి లేకుండా కూర్చొని ప్రేక్షకులు చూసి ఆనందించేలా ఆలపిస్తారు. ఆ విధంగా అంగ్‌క్లంగ్ వాద్యంలో కూడా భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రేక్షకులు వినగల్గేలా ఎందుకు ప్రదర్శించకూడదు?" అనే ఆలోచన ఆమెకు వచ్చింది. అలా జరగాలంటే మొదటగా ఆ పరికరం పరిమాణం తగ్గించాలి. ఆ పనిని అంగ్‌క్లంగ్ వాద్య నిపుణుల సహకారంతో చేయాలని ఆమె భావించారు. ధ్వని, మాధుర్యం, స్వరస్థానాలలో ఏ మాత్రం మార్పు లేకుండా దాని పరిమాణం తగ్గించడంలో ఎట్టకేలకు సఫలీకృతులయ్యారు. పునరుద్ధరించిన ఆ వాద్యానికి 'అంగ్‌క్రంగ్' అనే పేరునిచ్చారు. అక్టోబర్ 24న తన ఇద్దరు కుమారులు, దినేష్ (మృదంగం), ఉమేష్ (ఘటం) వాద్య సహకారంతో ఇండోనేషియా దూరదర్శన్‌లో కర్ణాటక సంగీత ప్రదర్శన ఇచ్చారు. తర్వాత పెర్త్ నగరంలో జరిగిన హిందూమహాసముద్ర ఉత్సవంలో (ఓషన్ ఫెస్టివల్ ఆఫ్ ఆర్ట్) ఆమెను ఇండోనేషియా ప్రభుత్వం ప్రతినిధిగా నియమించింది. పపువా న్యూ గినియాలో నివసిస్తున్న ఒక భారతీయ మహిళ ఆస్ట్రేలియాలో ఇండోనేషియాకు చెందిన సంగీతవాద్య ప్రదర్శన ఇవ్వడమంటే సాధారణ విషయం కాదు. అతికొద్ది కాలంలోనే అంగ్‌క్లంగ్‌తో ఒక గంట కచేరీ చేయగలిగేంతగా ఆ వాద్యంపై పట్టు సాధించారు అనసూయ. భారతదేశంలోనే కాక ఇతర దేశాలలోనూ ప్రపంచ సంగీత సాధనాల గురించి ప్రదర్శనాత్మక ఉపన్యాసం ఇచ్చారు. సందర్శకులంతా ఈ వాద్యాలను పవర్ పాయింట్ స్లైడ్స్‌లో వాయించి చూపితే బాగుంటుందని కోరడంతో ఆమె తన దగ్గరున్న వాద్యాలను స్వయంగా ప్రదర్శించి చూపాలని నిర్ణయించుకున్నారు. ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపడం వల్ల ప్రేక్షకులు ఆ వాద్యనాదంలో పూర్తిగా లీనమవగల్గుతారు. ఏది ఎలా ఉన్నా ప్రతిసారీ ఈ విలువైన వాద్యాలను కదిలించడం సాధ్యంకాదు కదా! ఇదంతా ఎప్పటికి సాధ్యపడుతుందో!" అంటారు అనసూయ సాలోచనగా.

మరొక శ్లాఘనీయమైన అంశం ఏమిటంటే అనసూయ గౌరవార్థం బెంగుళూరులోని పలు సంస్థలకు, మలేషియాలోని ఒక సంస్థకు ఆమె పేరు పెట్టారు. అనసూయ ఎన్నో టీవీ ప్రోగ్రాముల్లో పాల్గొనడమే కాకుండా ఎన్నో పాటల క్యాసెట్లను కూడా విడుదల చేశారు. 2001 వ సంవత్సరంలో అన్నామలై యూనివర్శిటీ నుంచి కర్ణాటక సంగీతంలో ఆమె డాక్టరేట్ అందుకున్నారు. 2008వ సంవత్సరంలో అంగ్‌క్లంగ్ వాద్యంలో భారతీయ శాస్త్రీయ సంగీతబాణీలో పలికించినందుకు గాను ఆమె పేరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. అదే సంవత్సరం అక్టోబర్ 24న ఐరాస దినోత్సవం సందర్భంగా 90 నిమిషాల పాటు దాదాపు 20 సంగీత వాద్యాలను ఒక సహచరుని సాయంతో పరిచయం చేస్తూ ప్రదర్శించారు. ఆ ప్రదర్శన యవనికలోని నృపతుంగరోడ్‌లో జరిగింది. అనసూయ మాత్రం సంగీత వాద్యాల సేకరణ, వాటిని వాయించే విధానం, ముఖ్యంగా అంగ్‌క్లంగ్ వాద్యంపై తన దృష్టిని పూర్తిగా కేంద్రీకరించారు. "మొదట నేను సేకరించిన వాద్యాలను మొదటి అంతస్తులో భద్రపరిచేదాన్ని. కానీ క్రమంగా సేకరణ వాద్యాలు ఎక్కువయ్యాయి. దాంతో రెండవ అంతస్తు కూడ నిర్మించి, రెండు అంతస్తుల్లోనూ అరలు, బీరువాలు డిజైన్ చేసి ప్రదర్శనకు వీలుగా తయారుచేశాము. కానీ ఇప్పుడు ఈ రెండు అంతస్తులు కూడా నిండిపొయ్యాయి" అని నవ్వుతూ చెప్తారు అనసూయ. మొత్తంగా ఇప్పటికి ఆమె సేకరించిన సంగీత వాద్యాల సంఖ్య అక్షరాలా 300. అంగ్‌క్లంగ్ కళాకారిణిగా ఆమె 'కర్ణాటక కళాశ్రీ' అవార్డు కూడా అందుకున్నారు.

అనసూయా కులకర్ణి జీవితం ఎందరెందరికో మార్గదర్శకమైంది. తమకు కావలసింది ఏమిటో కచ్చితంగా తెలుసుకొని, అదే దిశగా పయనించి లక్ష్యాన్ని చేరుకుని తాము ఎంతో సాధించామని పొంగిపోయేవారు కొందరైతే, లక్ష్యసాధనలో అవరోధాలకు జడిసి, తమ జీవితం ఎటు తీసుకెళ్తే అటు వెళ్లి, ఏమీ సాధించలేక పరిస్థితులను నిందిస్తూ కూర్చొనేవారు మరికొందరు. కానీ అనసూయ జీవితంలో తనకు ఎదురైన అవరోధాలనే అవకాశాలుగా మార్చుకుని ప్రపంచ సంగీత రంగాన్నే తన జీవితంగా మలచుకొని ఆరు పదుల వయసులో కూడా పరిస్థితులతో ఎలాంటి రాజీ పడకుండా సాగిస్తున్న పయనాన్ని హర్షించకుండా ఉండలేం. "నేను ఇక ఎక్కువ కాలం పాడలేననేది నిజం. అయినప్పటికీ పాడగలిగిన విద్వాంసులకు ఏ మాత్రం కొరతలేదు. కానీ అంగ్‌క్లంగ్‌పై శాస్త్రీయ సంగీతాన్ని పలికించగల ఏకైక కళాకారిణిని మాత్రం నేనే" అని సగర్వంగా చెప్తారు అనసూయ.

- నాగ శిరీష

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో
ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:
0-9789099589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

సంగీత ప్రియులకు ఎంతో ఇష్టమైన పదం. ఇంటర్నెట్ సంగీతం స్వరూప స్వభావాలనే మార్చేసిన పదం. కంప్యూటర్లలో సంగీతం అనే పదానికి అర్థం చెప్పిన పదం... ఎంపీ-3. దాదాపు ప్రతి కంప్యూటర్‌లోనూ కన్పిస్తున్న ఫైల్ ఫార్మెట్ ఇది. ఈ టెక్నాలజీ అప్పటివరకు కంప్యూటర్లలో వున్న హద్దులను చెరిపేసి కొత్త తరానికి ఆరంభాన్నిచ్చింది. అలాంటి ఎంపీ-3కి పదహారేళ్లు. దాని చరిత్రేంటి? మనకు ఏ విధంగా ఉపయోగపడుతోంది? మీకోసం...



ఎంపీ-3 స్వీట్ సిక్స్‌టీన్...

అప్పటి వరకు కంప్యూటర్లలో ఏదైనా సంగీతాన్ని నిల్వ చేయాలంటే పట్టే స్థలంలో కేవలం 10వ వంతు స్థలంలోనే నిల్వ చేయగల్గడంతో ఈ ఫార్మెట్ ప్రాచుర్యం పొందింది. 4 నిమిషాల పాటను నిల్వ చేయాలంటే 40 ఎంబి స్పేస్ అవసరమైతే, ఎంపి 3 ఫార్మెట్‌లో కేవలం 4 ఎంబి మాత్రమే అవసరమయ్యేది. ఇక ఇంటర్నెట్ ప్రాచుర్యంతో ఫైల్ ట్రాన్ఫరింగ్ మరింత సులభతరమైంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులను, కంప్యూటర్ వినియోగదారులను ఎలక్ట్రానిక్ సంస్థలను, మ్యూజిక్-రికార్డింగ్ సంస్థలను ముంచెత్తిన విప్లవం ఇది. సంగీత ప్రపంచంలో గ్రామ్‌ఫోన్లు ఎంతటి విప్లవాన్ని సృష్టించాయో, ఎంపి3 అంతకంటే ఎక్కువ ఆసక్తిని రేకెత్తించింది. ఈ టెక్నాలజీ సంగీతాన్ని నిల్వ చేసుకొని వినే పద్ధతులను సమూలంగా మార్చివేసింది. ఇంటర్నెట్ వేగం పెరగడం కూడా దీనికి ముఖ్యకారణం. ఇంటర్నెట్ ఆవిర్భవించిన నాటినుంచి నెట్‌లో అత్యధికంగా సెర్చ్ చేయబడే పదం 'సెక్స్'. దీన్ని కూడా అధిగమించి ప్రజాదరణ పొందిన పదం ఎంపి3. ఎంపి3 ఫార్మెట్‌లో సంగీతాన్ని అందించే వేలాది సైట్లు నెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. 'నేప్‌స్టర్' అనే చిన్న ప్రోగ్రామ్ దీనికి కారణమైంది. ఆ తర్వాత నేప్‌స్టర్ కంటే మరెంతో అధునాతన సర్వీసులు నెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. వీటి సాయంతో నెట్ నుండి తమకు నచ్చిన ఎంపి3 ఫార్మెట్‌లో వున్న సంగీతాన్ని ఆస్వాదించడం సాధ్యపడింది. దీంతో సంగీత వ్యాపార సంస్థలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఇది తమ కాపీరైట్ హక్కులను హరించడమేనని కోర్టులకెక్కాయి. ఈలోపు పిసిల నుండి సీడీ ప్లేయర్ల వరకు వాక్‌మన్‌లను పోలివుండే ఎంపి3 ప్లేయర్లతోపాటు సెల్‌ఫోన్లలోనూ ఈ ఫార్మెట్‌లో సంగీతాన్ని అందిస్తున్నాయి. కేవలం రెండు మూడు సంవత్సరాలలోనే మొత్తం సంగీత ప్రపంచాన్ని మార్చివేసిన ఎంపి3 ఫార్మెట్... నేడు కంప్యూటర్లతోపాటు సాధారణ ఆడియో ప్లేయర్స్, ఐపాడ్, సెల్‌ఫోన్ల వంటి వాటిలో కూడా వినడం వీలవుతోంది.

చరిత్ర

ఎంపి3... ఒక్కసారిగా వచ్చిన టెక్నాలజీ కానేకాదు. దీని చరిత్ర 1987లో జర్మనీలోని 'Fraunhofer Institute for Integrated Circuits'లో ప్రారంభమైంది. ఈ పరిశోధనా సంస్థ ఆడియోను డిజిటల్ ఫార్మెట్‌లో కంప్రెస్ చేసి ప్రసారం చేయడానికి పనికివచ్చే టెక్నాలజీపై పరిశోధనలు ప్రారంభించింది. యురేకా (EUREKA) ప్రాజెక్ట్ ఇయు 147. డిజిటల్ ఆడియో బ్రాడ్‌కాస్టింగ్ (డిఎబి) అనే పేరుతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌కి ప్రొఫెసర్ డైటర్ సైట్జర్ (Dieter Seitzer) నేతృత్వంలోని 40మంది ఇంజనీర్ల 5 సంవత్సరాల పరిశోధనల ఫలితంగా సౌండ్‌ఫైల్స్ వాటి క్వాలిటీ నష్టపోకుండా వాటి సైజులో కేవలం పది శాతానికి తగ్గించగలిగే కోడెక్ CODEC-Compression/Decompression) అల్గారిథమ్ తయారైంది. తర్వాతి కాలంలో ఎంపిఇజి (MPEG -Moving Picture Experts Group)చే 1992లో ఈ ఫార్మెట్ డిజిటల్ ఆడియో స్టాండర్డ్ ఫార్మెట్‌గా గుర్తింపు పొందింది. ఈ MPEG దృశ్య, శబ్ద నియమాలను నిర్దేశిస్తుంది. MPEG సంక్షిప్త నామంలోని మొదటి రెండు అక్షరాలను కలుపుకొని మూడో జనరేషన్‌కు సూచనగా 3ని కలిపి MP3గా వాడుకలోకి వచ్చింది. 1989లో జర్మనీలోను, 1995లో యుఎస్‌ఎలోనూ పేటెంట్ హక్కులు పొందిన తర్వాత అందరూ అధికారికంగా ఈ ఫార్మెట్‌లో సంగీతాన్ని వినడం ప్రారంభమై పదహారేళ్ళు. అంటే జూలై 14, 1995న తొలిసారిగా ప్రపంచానికి తెలిసిన ఎంపీ3 అనే పదం... ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పట్టణాల నుంచి పల్లెల వరకూ పండిత పామరులను సైతం తన సంగీత ఝరిలో ఓలలాడిస్తోంది.

1998లో ఇతర ఫార్మెట్లలో వున్న మ్యూజిక్ ఫైళ్లను ఎంపి3లోకి మార్చడానికి అవసరమయ్యే రిప్పర్ సాఫ్ట్‌వేర్లు, కంప్యూటర్లలో ఎంపి3 ఫైల్స్‌ని ప్లే చేయడానికి పనికొచ్చే ఎంపి3 ప్లేయర్ సాఫ్ట్‌వేర్లు విడుదల కావడంతో పాటు 1999 ఫిబ్రవరిలో SubPop అనే సంస్థ ఎంపి3 ఫార్మెట్‌లో మ్యూజిక్‌ని నెట్‌లో విడుదల చేయడంతో డిజిటల్ సంగీతంలో కొత్తశకం ఆరంభమైంది. టేబుల్ సైజులో వుండే ప్లేబ్యాక్ సాధనాలను కొత్త టెక్నాలజీలు అరచేతిలోకి తీసుకురాగలిగితే, ఈ ఎంపి3 ఫార్మెట్ వాటిని బొటనవేలు సైజుకి తీసుకొచ్చింది.

సాధారణంగా మనం ఉపయోగించే ఎంపి3 ఫైళ్లు 128కెబి స్టీరియో క్వాలిటీని కలిగి వుంటాయి. మామూలు సీడీ ఫార్మెట్‌లో ఒక నిమిషం సంగీతానికి 10ఎంబి స్పేస్ అవసరమైతే ఎంపి3కి కేవలం 1ఎంబి

సరిపోతుంది. ఈకారణంగా ప్రపంచవ్యాప్తంగా సంగీతాభిమానులు తమ వద్దనున్న సీడీలలోని పాటలను ఎంపి3 ఫార్మెట్‌లోకి మార్చి తమ కంప్యూటర్లలో నిల్వ చేసుకోగలుగుతున్నారు. దీంతోపాటు ఇంటర్నెట్‌లోకి సైతం అప్‌లోడ్ చేయడం, నెట్‌నుండి డౌన్‌లోడ్ చేసుకోవడం సులభమైంది. ఎంపి3లో వున్న మరో అద్భుతమైన ఫీచర్ ఏమిటంటే... దీన్ని ముక్కలు ముక్కలు డౌన్‌లోడ్ చేసుకోగలగడం. స్ట్రీమింగ్ సదపాయం కలిగి ఈ ఫార్మెట్ ఫైళ్లను డౌన్‌లోడ్ చేసేటప్పుడు తొలిభాగం డౌన్‌లోడ్ కాగానే వినవచ్చు. ఈలోపు మిగతా భాగం కూడా డౌన్‌లోడ్ అవుతుంది. ఎంపి3 ఆదరణ పొందడానికి ఇది కూడా ఒక కారణం.

అయితే ఈ ఫార్మెట్‌లో వున్న మ్యూజిక్ ఫైల్ సీడీలను కంప్యూటర్లలోగాని, దీనికోసం తయారుచేయబడిన ఎంపి3 ప్లేయర్లలో గాని మాత్రమే వినడం సాధ్యపడేది. తర్వాతికాలంలో ఎంపి3 ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకొని మనతో తీసుకెళ్ళగలిగే ఎంపి3 పోర్టబుల్ ప్లేయర్లు, ఎంపి3 ఫార్మెట్ సీడీలను వినిపించగలిగే ఆడియో సిస్టమ్‌లు విడుదల కావడంతో దీని వినియోగం మరింత పెరిగింది. అంతేకాకుండా వేవ్ లేదా ఇతర ఫార్మెట్‌లలోని ఫైల్స్‌ని ఎంపి3గా కన్వర్ట్ చేసుకోవడానికి పనికొచ్చే ఎన్‌కోడర్‌లు, సీడీలలోని మ్యూజిక్‌ను ఎంపి3కి మార్చే రిప్పర్లుతోపాటు ఎంపి3 ఫార్మెట్ నుంచి ఇతర ఫార్మెట్‌లలోకి మార్చుకోవడానికి పనికొచ్చే డీకోడర్‌లు, యుటిలిటీలు, రెండు అంతకంటే ఎక్కువ ఫైళ్లని ఒకే ఫైల్‌గా మార్చగలిగే మిక్సర్లు సైతం రూపొందాయి.

ఎంపి3 ప్లేయర్లు

కంప్యూటర్‌లో మాత్రమే ఎంపి3 సంగీతం వినదల్చుకుంటే 'విన్ యాంప్' వంటి ఎంపి3 ప్లేయర్ ఇన్‌స్టాల్ చేసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం ఇటువంటి ఎంపి3 ప్లేయర్ సాఫ్ట్‌వేర్లు వందల సంఖ్యలో లభ్యమవుతున్నాయి. ఇవి కేవలం ఎంపి3 ఫార్మెట్ ఫైళ్లనే కాకుండా ఇతర ఫార్మెట్‌లలోని ఫైళ్లను కూడా వినడానికి ఉపయోగపడతాయి. ఎంపి3 ప్లేయర్‌లలో అత్యంత ప్రసిద్ధి పొందిన సాఫ్ట్‌వేర్ విన్ యాంప్. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఉపయోగించబడే ఈ సాఫ్ట్‌వేర్ ఎంపి3తోపాటు మిడి, వేవ్ వంటి ఇతర ఫార్మెట్లను కూడా వినిపించగలదు. నెట్‌లో ఉచితంగా లభ్యమయ్యే ఈ సాఫ్ట్‌వేర్‌ను సీడీ రిప్పర్‌గానూ, ఎన్‌కోడర్‌గానూ, మిక్సర్‌గాను ఉపయోగించుకోవచ్చు.

ఎంపి3కి మార్చుకోవడం

సీడీల్లోని సంగీతాన్ని ఎంపి3లోకి మార్చి హార్డ్‌డిస్క్‌ల్లో నిల్వ చేసుకోవడం లేదా అదే ఫార్మెట్‌లో తిరిగి సీడీలలోకి కాపీ చేసుకోవడం సర్వసాధారణమైంది. ఏదైనా ఒక మ్యూజిక్ ఫైల్‌ను ఎంపి3కి మార్చాలంటే అది కంప్యూటర్‌లో నిల్వచేయబడిన డిజిటల్ ఫార్మెట్ ఫైల్ అయివుండాలి. తొలిరోజుల్లో వేవ్ ఫార్మెట్ లేదా ఏదైనా కంప్యూటర్ ఫార్మెట్ ఫైళ్లని మాత్రమే ఎంపి3 ఫైళ్లగా మార్చడానికి సాధ్యమయ్యేది. తర్వాతికాలంలో సీడీల నుంచే నేరుగా ఎంపి3కి మార్చుకోగలిగే రిప్పర్లు విడుదలయ్యాయి. సీడీ ట్రాక్‌లను ఎంపి3 ఫార్మెట్‌లోకి మార్చుకోవడానికి పనికొచ్చే అనేక రిప్పర్లు, ఆడియో ఫైల్స్‌ని ఒక ఫార్మెట్ నుంచి మరో ఫార్మెట్‌కి మార్చుకోవడానికి పనికొచ్చే అనేక సాఫ్ట్‌వేర్లు అందుబాటులో వున్నాయి.

ఎంపి3 ఇంతగా ప్రజాదరణ పొందడానికి కారణం.... దీన్ని ఎక్కువగా కంప్రెస్ చేసినప్పటికీ క్వాలిటీ తగ్గకపోవడం మొదటిది కాగా, ఇంటర్నెట్ వినియోగం పెరగడం రెండవది. దీని ఫైల్‌సైజ్ తక్కువగా వుండడంతో ఇంటర్నెట్‌లో అత్యధికంగా ఉపయోగించబడుతోంది. ఎంపి3 ఫార్మెట్ వినియోగం కంప్యూటర్లలోనే కాక వివిధ రకాల ఎంపి3 హార్డ్‌వేర్ ప్లేయర్లు, ఎంపి3 సీడీ ప్లేయర్లు, వాక్‌మన్లు వంటివే కాకుండా ప్రస్తుతం ఐపాడ్‌లు, సెల్‌ఫోన్లలో సైతం వందలాది పాటలు లోడ్ చేసుకొని గంటల తరబడి వినే అవకాశం ఇప్పుడు అందుబాటులో వుంది.

ఇంటర్నెట్‌లో ఎంపి3 హడావుడి పెరిగిపోవడంతో పైరసీ కూడా తారాస్థాయికి చేరుకుంది. ఫైల్ సైజులు తగ్గిపోయి, ఒక్క సీడీలోనే వందలాది పాటలు పట్టే పరిస్థితి రావడంతో సాధారణ వినియోగంలో సైతం పైరసీ పెరిగింది. ఎంపి3 ప్లేయర్ల ధరలు కూడా బాగా తగ్గడంతో ఇవి సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చాయి. ఇది పైరసీకి మరింత ఊతమిచ్చింది. ఆన్‌లైన్‌లో సొమ్ము చెల్లించి ఎంపి3 సంగీతాన్ని కొనుగోలు చేసే వారు కూడా లేకపోలేదు. సంగీత ప్రియులకు ఇంతచక్కటి సౌకర్యాన్ని అందించిన ఎంపి3 ఈ కాలపు అత్యున్నత టెక్నాలజీలలో ఒకటిగా పేర్కొనడం అతిశయోక్తికాదు.

- కె.ఎక్స్.రాజు

ప్రొఫెసర్ డైటర్ సెట్జర్



ప్రముఖ భారతీయ దర్శకుడు మణి కౌల్ మరణించారన్న వార్త సమాంతర చిత్రాలనూ, ఆ తరహా చిత్రాల రూపకర్తలనూ ప్రేమించే సినీ జీవులకు ఓ పెను విషాదం. సరిగ్గా ఏడాది క్రితం ఆయనను తొలిసారిగా పూణేలోని 'ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' (ఎఫ్.టి.ఐ.ఐ)లో చూసినప్పుడు ఓ ఆలోచనాశీలిని ప్రత్యక్షంగా కలుసుకున్న ఆనందం కలిగింది. ఆయనతో మాటామంతీ వెండితెర చూపాల్సిన మరో ప్రపంచాన్ని ముంగిట నిలిపింది. సమాంతర సినిమాకు ప్రతినిధిగా దేశవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా హిందీ చిత్ర సీమలో ఎంతో పేరు తెచ్చుకున్న 1970ల నాటి దర్శక శిఖరం చలనచిత్ర కృషి ఆదర్శ ప్రాయమే కాక, సర్వసాధారణ సినీ నిర్మాణ సూత్రాలను తిరగరాసిన ఆయన ధైర్యసాహసాలు అనుసరణీయం కూడా!



సమాంతర చిత్ర స్ఫూర్తి ప్రదాత మణికౌల్

చలనచిత్రాలను లోతుగా అధ్యయనం చేయాలని భావించి, వివిధ భారతీయ భాషా చిత్రాలను చూసేవారికి మణికౌల్ పేరు సుపరిచితం. భారతదేశంలో సమాంతర చలనచిత్ర ఉద్యమానికి మార్గదర్శకులుగా మణికౌల్, కుమార్ షహానీల పేర్లను ప్రముఖంగా ప్రస్తావిస్తారు. రూపొందించినవి ప్రధానంగా సమాంతర చిత్రాలు, డాక్యుమెంటరీలే అయినా, దేశవ్యాపంగా ఫిల్మ్ క్లబ్ సర్కిళ్ళలో మణి కౌల్ కృషి ఎంతో పేరు తెచ్చుకుంది. 1942 డిసెంబర్ 25న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో కాశ్మీరీ పండిట్‌లైన కౌల్ వంశంలో ఆయన జన్మించారు. ఆయన అసలు పేరు - రవీంద్రనాథ్ కౌల్. రాజ్‌కపూర్‌తో 'సప్నోం కా సౌదాగర్' లాంటి చిత్రాలు రూపొందించిన ప్రముఖ హిందీ నటుడు - దర్శకుడైన మహేశ్ కౌల్‌కు ఆయన మేనల్లుడు. అలాగే, ప్రసిద్ధ హిందీ తార రాజ్‌కుమార్ సైతం ఆయనకు దూరపు చుట్టం. పూణేలోని 'ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్' (ఎఫ్.టి.ఐ.ఐ) నుంచి వచ్చిన ప్రతిభావంతులైన తొలి తరం చిత్ర రూపకర్తల్లో ఒకరిగా మణి కౌల్ పేరును ఇవాళ్టికీ చెప్పుకుంటారు. సినిమాల మీద ఆసక్తితో ఆయన యౌవనారంభ దశలోనే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి అక్కడ చదువుకున్నారు. నటుడవ్వాలనే కోరికతో మొదట్లో ఆయన నటనా విభాగంలో చేరారు. ఆ తరువాత దర్శకత్వ శాఖకు మారి, 1966లో పట్టభద్రులయ్యారు. ఆ వెంటనే ముంబయ్‌కి వెళ్ళిన ఆయన, మూడేళ్ళ తరువాత తన తొలి చిత్రాన్ని జనం ముందుకు తెచ్చారు.

ప్రయోగాత్మక చిత్రాలకు కొత్త ఊపు

మణి కౌల్ ప్రధానంగా వివిధ సాహితీ రచనల్ని వెండితెరపైకి అనువదించడంపై దృష్టి పెట్టేవారు. ఆయన రూపొందించిన తొలి చిత్రం 'ఉస్కీ రోటీ' (1969) అదే పేరుతో వచ్చిన మోహన్ రాకేశ్ కథకు తెర రూపం. ఆ చిత్రం భారతీయ సినీ రంగంలో 'న్యూ వేవ్ సినిమా'కు ఓ మైలురాయి. భారతీయ సినిమాలోని తొలినాళ్ళ ప్రయోగాత్మక చిత్రాల్లో అది ఒకటి. మునుపటి చిత్రాలకు భిన్నమైన టెక్నిక్‌నూ, సినిమా రూపకల్పనా శిల్పాన్నీ, కథన ధోరణినీ అవలంబించడం ఆ చిత్రం గురించి నలుగురూ చెప్పుకొనేలా చేశాయి. మణి రెండో చిత్రం 'అషాఢ్ కా ఏక్ దిన్' (1971) సైతం మోహన్ రాకేశే రాసిన ఓ నాటకం ఆధారంగా రూపొందింది. చంద్రగుప్తుల కాలం నాటి సంస్కృత కవి కాళిదాసు, ఆయన ప్రేయసి మల్లిక, వారి మిత్రుడు విలోమ్‌లు ముగ్గురి మధ్య ఈ కథ ప్రధానంగా నడుస్తుంది. ప్రేమకూ, అధికారిక బాధ్యతలకూ మధ్య ఎటువైపు మొగ్గాలనే విషయంలో ఓ కళాకారుడికి ఎదురైన నైతిక సందిగ్ధత ఈ చిత్ర ఇతివృత్తం. ఇక, మణి కౌల్ మూడో చిత్రం 'దువిధా' (1973) సైతం ఓ కథానికకు సినిమా రూపమే. దెయ్యం కథగా ఈ హిందీ చిత్రం కూడా సాహిత్యంలో నుంచి సినిమాగా రూపొందినదే! రాజస్థాన్‌లోని ప్రసిద్ధ జానపద గాథ ఆధారంగా విజయదాన్ దేథా రాసిన కథ ఈ చిత్రానికి మాతృక. మణి కౌల్‌కు ఎంతో పేరు తెచ్చిన 'దువిధా' చిత్రం ఆయనకు ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డును తెచ్చిపెట్టింది. ఐరోపా ప్రాంతంలో ఈ చిత్రాన్ని విస్తృతంగా ప్రదర్శించారు. (ఈ కథనే ఆ మధ్య షారుఖ్ ఖాన్‌తో 'పహేలీ' (2005)గా అమోల్ పాలేకర్ రూపొందించారు). ఆ మూడు చిత్రాలకూ, ఆ తరువాత 'ఇడియట్' (1992) చిత్రానికీ - ఇలా మొత్తం నాలుగు సార్లు ఆయన ఉత్తమ చిత్రాలకు ఇచ్చే ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డ్'ను గెల్చుకున్నారు.

సినిమా బోధనలో స్వీయ శైలి

సినిమాను అపారంగా ప్రేమించిన ఆయన ఫిల్మ్‌ల రూపకల్పనతో పాటు ఆ మాధ్యమంలోకి రావాలనుకొనే విద్యార్థులకు అధ్యాపకుడిగా కూడా అమూల్యమైన సేవలందించారు. నెదర్లాండ్స్‌లో సంగీతం బోధించారు. బోస్టన్‌లోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో, నార్త్ కరోలినాలోని డ్యూక్ యూనివర్సిటీలో, ఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని రిగ్స్ అకాడెమీలో గెస్ట్ ప్రొఫెసర్‌గా దాదాపు 12 ఏళ్ళ పాటు సినిమా గురించి బోధిస్తూ వచ్చారు. పన్నెండేళ్ళ విదేశీ జీవితం తరువాత 2007లో భారత్‌కు తిరిగొచ్చిన ఆయన ముంబయ్‌లోని 'ఓసియాన్స్ కన్నాయిజర్స్ ఆఫ్ ఆర్ట్'లో ఫిల్మ్ హౌస్‌కు క్రియేటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. మణి కౌల్ తాను చదువుకున్న పూణే 'ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్'కు తరచూ వస్తుండేవారు. అక్కడి విద్యార్థులకు అప్పటికప్పుడు ఏవో పాఠాలు చెబుతుండేవారు. ఇవాళ్టి ప్రముఖ నటుడు, దర్శకుడు రజత్ కపూర్ లాంటి వాళ్ళు మణి కౌల్ విద్యార్థులే. సరిగ్గా క్రితం ఏడాది జూన్ చివరలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చి, 'ఫిల్మ్ ఎప్రీసియేషన్' కోర్సు చేయడానికి శ్రీలంకతో సహా మనదేశం నాలుగు చెరగుల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులతో ఆయన ఉల్లాసంగా గడిపారు. ప్రముఖ దర్శకుడు ఋత్విక్ ఘటక్ శిష్యరికంలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ తొలి బ్యాచ్ విద్యార్థి అయిన మణి కౌల్ తన గురుభక్తిని ఎప్పుడూ చాటుకుంటూ ఉండేవారు. "ఋత్విక్ ఘటక్‌ను కలుసుకోకపోతే, నేను ఏమై ఉండేవాణ్ణో నాకే తెలియదు" అని నిజాయతీగా ఒప్పుకొనే మణి అదే సమయంలో, "ఘటక్ చిత్రాలు నన్ను కదిలించివేశాయి. వాటిని నేను ఆరాధించాను. అయితే, ఆయన చిత్రాల నుంచి నేను ప్రేరణ పొందలేదు" అని అంతే నిక్కచ్చిగా చెప్పారు. అయితే, విద్యార్థులకు సినిమాల గురించి ఎలా బోధిస్తారని అడిగినప్పుడు, "ఏముంది! ఋత్విక్ ఘటక్ చిత్రాలు ఎనిమిదీ సీ.డీలు కొనుక్కోమంటాను" అని ఆయన సరళంగా సమాధానమిచ్చారు.

ఎందరికో స్ఫూర్తిదాత

అనుపమ్ ఖేర్ తన సంతాప సందేశంలో పేర్కొన్నట్లు, "మణి కౌల్ చక్కటి సంభాషణా చతురుడు." కలసిన ప్రతిసారీ విద్యార్థుల్లో మణి కౌల్ తెచ్చే కొత్త ఉత్సాహం, సంతోషం మాటలకు అందని మధురమైన అనుభవం. ఆయన ఎప్పుడూ తన మీద, తన సినిమాల మీద స్వయంగా ఛలోక్తులు విసురుతుంటారు. సెల్యులాయిడ్ కృషిలో ఎంతో గంభీరంగా కనిపించే ఆయన బయట అంత సరదాగా ఉంటారు. "ఆయన 'సిద్ధేశ్వరి' తీస్తున్ననాటికి మేము ఇంకా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటున్నాం. ఆ ఫిల్మ్ చూడగానే నాకు మతి పోయింది. ఆ తరువాత ఆయన రూపొందించిన 'నజర్' అనే 20 నిమిషాల చిత్రానికి నేను ఆయన వద్ద సహాయకుడిగా వ్యవహరించాను. ఆ చిత్రానికి కెమేరా బాధ్యతలు నిర్వహించిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీయూష్ షా వద్ద రఫీ మెహమూద్ పని చేశారు. మేమంతా కలసి ఓ ఏడాది పాటు ఆ సినిమాకు పనిచేశాం. చిత్రాల

రూపకల్పనకు సంబంధించి అక్కడే తొలి పాఠాలు నేర్చుకున్నాం" అని రజత్ కపూర్ ఆ సంగతులు గుర్తు చేసుకున్నారు.

వైవిధ్యభరిత ప్రయత్నాలు

"ప్రేక్షకులకు ఒక నిర్ణీతమైన అంశంపై దృష్టిపడేలా చేయడం కోసం ఫిల్మ్ తీస్తాం" అని చిత్ర రూపకల్పన అంతరార్థాన్ని విప్పిచెప్పే మణి "నేను తీసిన చిత్రాలన్నీ ఒకదానికొకటి భిన్నమైనవి" అని సగర్వంగా చాటుతారు. తొలి చిత్రం 'ఉస్కీ రోటీ' తీసినప్పుడు ఆయనను అందరూ ఎగతాళి చేశారు. సినిమా కొని, రిలీజ్ చేసే వాళ్ళ కోసం దాన్ని పదే పదే ప్రదర్శించాల్సి వచ్చినప్పుడు, ప్రధాన స్రవంతి సినిమా రూపకర్తలందరూ 'అది ఓ పెద్ద శిక్ష' అంటూ మణి కౌల్‌ను గేలి చేశారు. చివరకు ఆ చిత్రం సమాంతర చిత్రాల ఉద్యమానికి పతాకగా నిలిచింది. హిందుస్తానీ సంగీతం, రుద్రవీణ, హిందుస్తానీ సంగీతంలోని పురాతన 'ధ్రుపద్' శైలి గానంలో శిక్షణ పొందిన మణి కౌల్ 'ధ్రుపద్' (1982) పేరుతోనే ఫిల్మ్స్ డివిజన్‌కు ఓ గంట నిడివికి పైగా డాక్యుమెంటరీని రూపొందించారు. 'ఉస్కీ రోటీ', 'దువిధా' లాంటి చిత్రాల్లో మహిళల స్థితిగతుల్ని మణి కౌల్ చర్చించారు. 'నౌకర్ కీ కమీజ్' (నౌకరు చొక్కా – 1999) చిత్రంలో సమాజంలోని బీదా గొప్పల మధ్య సంబంధాలను చూపెట్టారు. 'ఎరైవల్', 'బిఫోర్ మై ఐస్', 'ఎ డిజర్ట్ ఆఫ్ ఎ థౌజండ్ లైన్స్' లాంటి నయన సమ్మోహకమైన డాక్యుమెంటరీలు రూపొందించారు. ముఖ్యంగా, కాశ్మీర్ లోయలో 'జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్' (జె.కె.ఎల్.ఎఫ్) ప్రభావం ఎక్కువై, వేర్పాటువాద ఉద్యమం తారస్థాయిలో ఉన్న సమయంలో ఆయన తీసిన 'బిఫోర్ మై ఐస్' (1998)ని పన్నెండేళ్ళ తరువాత గత ఏడాది ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రదర్శించినప్పుడు కూడా విద్యార్థులందరం నోరు వెళ్ళబెట్టుకొని చూశాం. గగనంలో ఎగురుతున్న వేడి గాలిబుడగలో నుంచి ఆ ప్రాంతాన్నీ, ప్రజల్నీ కెమేరాలో బంధించిన తీరు, నేపథ్య సంగీతం అబ్బురపరిచాయి. ముందుగా ఓ స్క్రిప్టు రాసుకున్నా, అసలు సిసలు స్థల కాలాలనే తెరపై చూపాలన్న తన పిచ్చి ప్రేమ వైపే మొగ్గి, స్క్రిప్టు లేకుండా తీసినట్లు మణి చెప్పారు. దోస్తోవిస్కీ రచనలకు సైతం తెరపై భాష్యం చెప్పడానికి ఆయన కృషి చేశారు. దోస్తోవిస్కీ కథ 'ఎ జెంటిల్ క్రీచర్' ప్రేరణ అతి తక్కువ లైటింగ్‌లో మణి కౌల్ రూపొందించిన 'నజర్' (1989) మీద స్పష్టంగా కనిపిస్తుంది. మొత్తం మీద, హిందీ చలనచిత్ర పరిశ్రమలోని ప్రధాన స్రవంతి వాణిజ్య చిత్రాల శైలికి దూరంగా ఉంటూ, తనదైన చిత్ర రూపకల్పన శైలిని కొనసాగించిన అరుదైన దర్శకుడు – మణి కౌల్. సమాంతర చిత్ర ఉద్యమ కెరీర్‌లో నటుడు ఓం పురికి తొలి చిత్ర అవకాశం ఇచ్చింది కూడా ఆయనే! ఓం పురి ప్రధాన పాత్రధారిగా ఆయన రూపొందించిన 'ఘాశీరామ్ కొత్వాల్' (1976) చిత్రానికి మూలం – విజయ్ టెండూల్కర్ అదే పేరుతో రాసిన మరాఠీ నాటకం. శివసేన ప్రాబల్యంపై ఓ వ్యంగ్య చిత్రంగా అది అందరినీ ఆకర్షించింది.

స్పష్టమైన అభిప్రాయాలు

ఎన్ని కష్టనష్టాలు, ఆటంకాలు ఎదురవుతున్నా, చెదరకుండా తన దృక్కోణానికే కట్టుబడి, సెట్‌లో ధ్రుపద్ శైలి గీతాలు పాడుతూనే నటుల నుంచి ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని రాబట్టే నిర్భయుడైన దర్శకుడాయన! "వాస్తవికత, సహజత్వం – రెండూ వేరు వేరు. సహజత్వమనేది వాస్తవికతకు పుట్టిన ఫలం. సినిమా అనేది కేవలం వాస్తవికతను చూపెట్టడం కాదు! చూపెట్టడంలో వాస్తవికత ఉండడం!" అని ఈ అపురూప దర్శకుడు గత వేసవిలో ఈ వ్యాసకర్తతో అన్నారు. సున్నితమైన ఆలోచన, సమాజం, రాజకీయాల పట్ల అవగాహన కలిగి, తన కెమేరా సృజనలన్నిటిలో వాటిని ప్రతిఫలించే అరుదైన వ్యక్తిగా తొలి పరిచయంలోనే మణి కౌల్ కట్టిపడేస్తారు. "నేనెప్పుడూ డబ్బు గురించి ఆలోచిస్తూ, ఇబ్బందిపడుతూ సినిమాలు తీయలేదు. నిజాయతీగా మన ప్రయత్నం మనం చేస్తుంటే, డబ్బు దానంతట అదే సమకూరుతుంది. ఇవాళ భారీ చిత్రాలుగా చెప్పుకొంటూ, రికార్డులు బద్దలు కొడుతున్నాయని మురిసిపోతున్న చిత్రాల జీవితకాలం నిజానికి 3 వారాలే! ఆ తరువాత జనం వాటిని మర్చిపోతారు" అని ఆయన చెప్పారు. సినిమా అనేది

'దువిధా'లో ఓ దృశ్యం

స్థల కాలాలు రెంటికీ సంబంధించినదని ఆయన నిశ్చితాభిప్రాయం. "సాధారణంగా అందరూ స్థలం మీద దృష్టి పెడుతున్నారు. కానీ, ఆ రెండున్నర గంటల వ్యవధిలో షాట్‌లు ఏ కాలపరిమితిలో ఉండాలో చూసుకోవాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు. "ప్రతి సినిమా కథలోనూ ఒక విలక్షణ అంశం ఉంటుంది. దాన్ని పట్టుకొంటే, సినిమా తీయగలుగుతాం" అన్నారాయన. ఇంతకీ, ఏ సినిమానైనా ఎలా ఆస్వాదించాలి? ఎలా అంచనా వేయాలి? దీనికి మణి కౌల్ ఈ సులభ సూత్రం చెప్పారు. "సౌండ్, లొకేషన్, దృశ్యం – ఈ మూడూ వేటికవి సినిమాలో పురోగమించాలి. ఆ మూడింటి మధ్య ఒక అనుబంధం పెంపొందాలి. శబ్దం పోకడ, దృశ్యం పోకడ – ఈ రెంటి మీద దృష్టి పెట్టి చేస్తూ, సినిమాను సరైన రీతిలో ఆస్వాదిస్తాం, అంచనా వేస్తాం" అని ఆయన వివరించారు.

ఆఖరి వరకు సినిమాయే శ్వాస

నిజానికి, చనిపోయే ముందు వరకు సినిమాల పట్ల ఆయన మోహం తగ్గనే లేదు. ఆధునిక భారతదేశంలో తన తరహా చిత్రాలకు ప్రేక్షకులున్నారని ఆయన నమ్మారు. "అనురాగ్ కాశ్యప్, విశాల్ భరద్వాజ్ లాంటి ఈ నాటి ప్రధాన స్రవంతి చిత్ర దర్శకులు నా సినిమాలను చూసి ప్రేరణ పొందామని చెప్పినప్పుడు నేను ఆశ్చర్యపోయా. గతంలో ప్రధాన స్రవంతి చిత్రాలకూ, సమాంతర చిత్రాలకూ మధ్య ఎంతో అంతరం ఉండేది. కానీ, ఇవాళ ప్రధాన స్రవంతి వాళ్ళలో కూడా కొత్త తరం దర్శకులు ఎంతో చక్కటి చిత్రాలు తీస్తున్నారు. జనం ఆదరిస్తున్నారు" అని మణి కౌల్ చెప్పారు. అందుకే, 2007లో స్వదేశానికి తిరిగొచ్చినప్పటి నుంచి మణి కౌల్ మళ్ళీ తన శైలిలోనే మరో చిత్రం రూపొందించాలని తపించారు. "భారతదేశంలో సర్వసాధారణమైపోతున్న హింస మీద చిత్రం రూపొందించాలనుకుంటున్నా" అని ఆయన తెలిపారు. కానీ, అంతలోనే క్యాన్సర్ వ్యాధితో అస్వస్థులైన మణి కౌల్ ఢిల్లీకి సమీపంలోని గుర్గావ్‌లో ఈ జూలై 6న మరణించారు. మణి కౌల్ మరణం పట్ల దేశవ్యాప్తంగా పలువురు చిత్ర ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు. అనుపమ్ ఖేర్, మధుర్ భండార్కర్, శిరీశ్ కుందర్, సంగీత్ శివన్ లాంటి వారి సంతాప సందేశాలు ట్విట్టర్‌లో వెల్లువెత్తాయి. "సృజనాత్మక భారతీయ సినిమాకు సంబంధించిన ఆఖరి యోధుడు కూడా కన్నుమూశాడు. భారతీయ సినిమా అంటే ఎంతసేపూ సమతలంగా ఒకే పార్శ్వాన్ని చూపే వాణిజ్య చిత్రాలే అన్న భావన ప్రబలుతున్న ఈ రోజుల్లో అందుకు భిన్నమైన చిత్ర రూపకర్త మణి కౌల్ మరణం పెద్ద లోటు" అని దర్శకుడు గౌతమ్ ఘోష్ వ్యాఖ్యానించారు. అవును! ప్రయోగాత్మకత, సృజనాత్మకత వికసించడానికి అతి తక్కువ అవకాశాలున్న భారతీయ సినిమాకు మణి కౌల్ మరణం నిజంగా లోటే. నవీన సినిమా గురించి, నవీన భారతదేశం గురించి మనవాళ్ళు ఎన్నెన్నో మాటలు చెబుతుంటారు. కానీ, తీరా అలాంటి నవీనమైన ఆలోచనలున్న మణి కౌల్, కుమార్ షహనీ లాంటి వారికి మాత్రం చేయూతనివ్వరు. ఆ మేధావులు బతికుండగా చిత్రాలు తీయడానికి వారికి కనీసం 10 లక్షల రూపాయలైనా పెట్టుబడిగా పెట్టడానికి మనవాళ్ళు ముందుకు రారు. తీరా మనిషి చనిపోయాక, అతణ్ణి మేధావిగా పేర్కొంటూ, వారి చిత్రాలను ప్రదర్శిస్తూ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. మణి కౌల్ గత ఎనిమిదేళ్ళుగా చిత్రాలు రూపొందించ లేకపోయారు. అలాగే, కుమార్ సాహ్నీ చిత్రం తీసి, అయిదేళ్ళ పైనే అయింది. రజత్ కపూర్ చెప్పినట్లు, "మనమందరం సిగ్గుపడాల్సిన విషయం ఇది. మణి కౌల్ లాంటి చిత్ర రూపకర్తలను ఎవరినైనా సరే మనం గుర్తు పెట్టుకొనేది తెరపై వారు చూపిన కృషి ద్వారానే! కాబట్టి వాళ్ళకు మనం చేయాల్సిన సేవ అల్లా – వాళ్ళను చిత్రాలను తీయనివ్వడమే!"

- రెంటాల జూనియర్

కవిత్వమ్

ఆశగా వుంది....



ఆశగా ఉంది...
పండు వెన్నెల్లో
తడిసి ముద్దవ్వాలని

చందమామను చేత బట్టుకుని
చిందులేయాలని

చల్లటి గాలిని
దుప్పటిలా కప్పకోవాలని

మబ్బు తునకలను
మునివేళ్లతో తురమాలని

నీలాకాశంపై
నిచ్చెన వేయాలని

మంచు బిందువులను మాలగా చుట్టి
మెడలో ధరించాలని

భ్రమరాన్నై
అరవిందాల మకరందాలు గ్రోలాలని

మెరిసే తారలతో
ముంగిట్లో ముగ్గులు వేయాలని

హరివిల్లుని
ఊయలగా చేసి ఊగాలని

కోకిల గానాలాపనలో
పల్లవి కావాలని

పచ్చని ప్రకృతిని పిడికిట బట్టుకుని
అధరాలతో చుంబించాలని
ఆశాగా ఉంది

- సయ్యద్ రసూల్

కాలమే అద్దం

ఎల్లవేళలా
ఎవరెస్ట్ శిఖరంలా
తెల్లని ఒక అద్దం
నీ చుట్టూ తిరుగుతుంటుంది
భూమికెన్ని దిక్కులో దాని
భ్రమణానికీ అంతే

సూర్యుణ్ణని మురిసిపోతుంటావు
చంద్రుణ్ణేమోనని చచ్చిపోతుంటావు
ఎర్ర చంద్రుడిలా, చందన గంధంలా
గడియారంలో సెకన్లముల్లులా
నీళ్లలో చేపలా
జనసముద్రంలో సంచరించు

నల్లని జుట్టూ
దృఢంగా శరీరమూ
మన్మధంగా ముఖమూ
శాశ్వతం కాదని నీకూ తెలుసు

ఎల్లవేళ్లలూ నీవే కావాలని
ప్రాణాలు ప్రపంచానికిచ్చి
ప్రజల్లో కలువు
కాలమే నీకు అద్దం పడుతుంది

- డా॥ మానేపల్లి



ప్రభుత్వాల తీరు ఇదే

అసెంబ్లీలో అరుపులు
పార్లమెంటులో పొలికేకలు
అధికారం అవకతవకలకు
ప్రతిపక్షాల పట్టుదలకు
ఏకసభ - త్రి సభ్యుల
కమీషనులతో
కాలం చెల్లిస్తారు
ప్రజాబిల్లులు
చిల్లులు పొడిచి
రాజ్యాంగం తీరు మార్చి
ప్రజాధనం నీరుగార్చి
సమావేశాల కాలాన్ని
కాలరాసి
పాలన సాగిస్తారు
ప్రజాస్వామ్యం
పట్టువిడిచి
శాశ్వత పథకాలని చెప్పి
పన్నుల వాత నెత్తినెట్టి
శూన్య శాశనాలు చూపెట్టి
ప్రభుత్వాలు నడుపుతారు

- సీరపు మల్లీశ్వరరావు

నవ్వుల్ - పువ్వుల్

తెల్ల జుట్టు

కూతురు: అమ్మా నీకు అన్ని తెల్ల వెంట్రుకలు ఎందుకొచ్చాయి?
తల్లి: నువ్వు అమ్మ చెప్పినమాట వినకుండా తప్పు చేసినప్పుడల్లా ఒక్కో వెంట్రుక తెల్లబడిపోయిందమ్మా.
కూతురు: అవునా! మరి అమ్మమ్మ జుట్టంతా తెల్లగా అయింది కదా. అది కూడా అందుకేనా!

టికెట్లు

భర్త: ఇవాళ ఆదివారం కదా. రోజంతా బాగా ఎంజాయ్ చేయాలనుకుంటున్నా.
భార్య: ఎలా?
భర్త: మూడు సినిమా టికెట్లు తెచ్చాగా!
భార్య: మూడెందుకు?
భర్త: నీకు, మీ అమ్మానాన్నలకు.

పొగడ్త

భార్య: నాకు వయసైపోయింది. శరీరం ముడతలు పడింది. లావుగా అయ్యాను. ఇంకా నువ్వు నన్ను పొగడడానికి ఏముంది?
భర్త: ఇప్పటికీ నీ కంటి చూపు అస్సలు తగ్గలేదు తెల్సా.

ఉచితం



కస్టమర్: రోజూ కాఫీకి డబ్బు కట్టించుకుంటావు కదా. ఇవాళ ఉచితంగా కప్పు కాఫీ ఇస్తే ఎంత బాగుంటుందో!
సర్వర్: మీరు రోజూ కప్పు నిండా కాఫీ తాగుతున్నారుకదా. ఇవాళ ఖాళీ కప్పుతో కాఫీ తాగితే ఎంత బాగుంటుందో!

డూప్లికేట్



రోగి: డాక్టర్! నేను తాళం చెవి మింగేశాను.
డాక్టర్: ఎప్పుడు?
రోగి: మూడు నెలల కిందట డాక్టర్.
డాక్టర్: మరి అప్పటినుంచి ఏం చేస్తున్నారు?
రోగి: డూప్లికేట్ తాళం వాడుతున్నాను డాక్టర్!

ప్రాణవాయువు

టీచర్: మనం ప్రాణాలతో బతకడానికి ఆక్సిజన్ అవసరం. దీన్ని 1773వ సంవత్సరంలో కనిపెట్టారు.
కొంటె విద్యార్థి: అమ్మయ్య. నేను 1773 తర్వాత పుట్టినందుకు సంతోషిస్తున్నాను. అంతకంటే ముందు పుట్టివుంటే ఏం పీల్చుకునేవాణ్ణి?!

ఎవరూ చదవకుండా

విద్యార్థి: టీచర్! నేను కంప్యూటర్‌లో నా పాస్‌వర్డ్ కొట్టినప్పుడు అక్షరాలన్నీ నక్షత్రాల్లా కనిపిస్తున్నాయి ఎందుకంటారు?
టీచర్: నీ వెనక ఎవరైనా వుంటే వారికి అర్థం కాకుండా అన్నమాట.
విద్యార్థి: నా వెనక ఎవరూ లేనప్పుడు కూడా అలాగే వస్తోంది టీచర్.

న్యుమోనియా

రోగి: డాక్టర్! ఓ సారి ఒక డాక్టర్ ఒక పేషెంట్‌కి న్యుమోనియాకు చికిత్స చేస్తే కామెర్ల వ్యాధితో చనిపోయాడంట. నాకు ఆ సమస్య రాదుకదా.
డాక్టర్: లేదు. నేను న్యుమోనియారోగికి చికిత్స చేస్తే అతను న్యుమోనియాతోటే చనిపోతాడు. అంతేకానీ మరో రోగం వల్ల చావడు.

విదేశీ

భర్త: నేను విదేశీయుడిలా కనిపిస్తున్నానా?
భార్య: లేదు
భర్త: మరోసారి చూసి చెప్పు. నేను విదేశీయుడిలా కనిపిస్తున్నానా?
భార్య: లేదు.
భర్త: అయితే నిన్న నాకు కనిపించిన అమెరికా ఆడవాళ్లంతా ఫూల్స్ అన్నమాట. నేను విదేశీయుడిలా వున్నానన్నారు!

రక్తం

రాకేష్: ఏంటండీ మరీ అన్యాయంగానూ. మొదటిసారి రక్తం ఇస్తే పదివేలరూపాయలిచ్చారు. రెండవ సారి రక్తదానం చేసినందుకు అంతకంటే ఎక్కువ డబ్బులిస్తారనుకుంటే క్యాడ్బరీస్ చాక్లెట్‌తో సరిపుచ్చారేంటి?
విఘ్నేష్: ఇప్పుడు నా శరీరంలో నీ రక్తం ప్రవహిస్తోందికదా. అందుకే నీలా ప్రవర్తించి వుంటాను.

- కె. వీరేంద్ర,
ఒమ్మెవరం, ప్రకాశం.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

చూద్దామా



ఆహ్లాదకరమైన వాతావరణం... పచ్చని కొబ్బరి చెట్లు... ప్రశాంతంగా ఉండే లెక్కలేనన్ని పిల్లకాల్వలు... గలగల పారే సెలయేర్లు... నేలంతా పచ్చని తివాచీ పరిచినట్లుండే టీ తోటలు... చేయి తిరిగిన చిత్రకారుడు గీచిన చిత్రంలా కనిపిస్తుందా దృశ్యం. పచ్చని పొదరిల్లులా ఉండే ఆ అందాల్ని చూడాల్సిందే తప్ప చెప్పడానికి మాటలు చాలవు. తొలకరి వానల్లో మరింత అందంగా కనిపించే కేరళ అందాలు ఈ వారం చూద్దామాలో...

ప్రకృతి సోయగం... కేరళ తీరం!

వర్షానికి తడిచి ముద్దయిన ప్రకృతి అందాలు... చల్లని గాలులు... మనసుకు స్వాగతం పలుకుతాయి. దారి పొడవునా పచ్చని కొబ్బరి తోటలు, మధ్యమధ్యలో ఎర్రని పెంకుటిళ్లు, నిర్మలంగా ఉండే పిల్లకాల్వలు... ఇవన్నీ ప్రకృతి మనకోసమే అందించిన అద్భుతమైన కానుకలనిపిస్తుంది.

కోవళంలో సముద్రాన్ని చూసి ఒక్క క్షణం మనల్ని మనమే మైమరచిపోతాం. ఎదురుగా ఎగసిపడే అలలు... ఆ పక్కనే కొండలు.. ఆ కొండల మీదే రెస్టారెంట్లూ, కొబ్బరి చెట్లూ ఉంటాయి. అక్కడ అన్నింటికన్నా ఆకర్షించేవి నెట్ ఉయ్యాలలు. వాటిని చూడగానే అందులో కాసేపు సేద తీరాలనిపిస్తుంది. కనువిందు చేసే ప్రకృతి మధ్య చేసే భోజనం మహా రుచిగా ఉంటుంది.

తిరువనంతపురంలో తప్పకుండా చూడాల్సిన వాటిలో ఒకటి పద్మనాభస్వామి ఆలయం. అక్కడ పవళించి ఉన్న స్వామి విగ్రహాన్ని మూడు ద్వారాల నుండి చూడాలి. ప్రపంచంలో మరే ఆలయంలో లేనంత సంపద ఈ ఆలయంలో ఉంది! ఇక్కడే మోహినీ రూపంలోని విష్ణుమూర్తి విగ్రహం కూడా ఉంది. అక్కడ్నుండి అలెప్పీ వెళ్లే దారిలో మున్నార్ శాలలో నాగలక్ష్మి, నాగ చాముండి, విష్ణుమూర్తి ఆలయాలు, అంబలపుజలో శ్రీ కృష్ణుడి ఆలయం ఉన్నాయి.

కదిలే ఇల్లు

అలెప్పీ ఊరంతా కాలువలమయమే. అందుకే దీన్ని 'వెనిస్ ఆఫ్ ది ఈస్ట్' అంటారు. ఇక్కడ పడవ ప్రయాణం అద్భుతంగా ఉంటుంది. పడవే ఓ పెద్ద ఇల్లులా ఉంటుంది. పడకగదులు, వంటగది, హాలు... అన్నీ ఆ కదిలే ఇంట్లోనే ఉంటాయి. అందులో విహారం ఓ మధురమైన అనుభవం.

అలలు లేని నీళ్లలో పడవ నెమ్మదిగా కదులుతుంటే... చల్లని పిల్లగాలులు శరీరాన్ని తాకుతూ ఊసులాడుతుంటే... మనసు పరవశించిపోతుంది. అసలు ఆ ఆనందం... సంతోషం... చెప్పడానికి మాటలు చాలవేమో. చుట్టూ నీళ్లు... మధ్యమధ్యలో ఇళ్లూ....కొబ్బరి చెట్లూ, అరటి తోటలతో కమనీయ దృశ్య కావ్యంలా ఉంటుందా ప్రదేశం. సాయంత్రం ఆరు గంటలకు పడవ ఆపేస్తారు. అక్కడికి దగ్గర్లో ఒడ్డుమీద మసాజ్ సెంటర్లు కూడా ఉంటాయి. ఇష్టమైనవాళ్లు వెళ టంటారు. మనిషికి వెయ్యి రూపాయలు తీసుకుంటారు.

ప్రకృతిలో లీనమై కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే టైమే తెలీదు. అంతలోనే రాత్రి భోజనం సిద్ధమంటూ పడవ వాళ్లు పిలుస్తారు. నిద్ర కూడా అందులోనే. ఉదయాన్నే నిద్ర లేచేసరికల్లా వేడి వేడి ఇడ్లీ సాంబార్ సిద్ధం.

సర్వమత సామరస్యం...

అక్కడ్నుండి కుమర్‌కోమ్ వెళ్లే దారిలో రెండు చర్చీలుంటాయి. ఇవి అన్ని మతాలూ ఒక్కటే అని చెప్తాయి. అందులో ఒకటి 1579లో కట్టినదైతే. మరోటి అంతకంటే పురాతనమైంది. మొదటి చర్చి ప్రత్యేకత ఏంటంటే... వత్తులతో అఖండదీపం వెలిగించడం. ఇక్కడ శంఖుచక్రాలు, మినార్లు, శిలువ కూడా ఉన్నాయి.

కుమర్‌కోమ్....

కుమర్‌కోమ్‌లో ఉండడానికి వాటర్ స్కేప్స్ కాటేజీలు ఉంటాయి. బారులు తీరిన కొబ్బరిచెట్లు, పిల్లకాలువలు.. వాటి మీద కాటేజీలు. ఎదురుగా రంగు రంగుల పూలమొక్కలతో నిండిన పెద్ద కొలను. ఆ దృశ్యాలన్నింటినీ కళ్లప్పగించి అలా చూస్తుండిపోతాం. అక్కడున్న వెంబనాడ్ సరస్సులో బోటు విహారం మనసును ఆనంద డోలికల్లో తేలియాడిస్తుంది.

సరస్సును ఆనుకున్న మబ్బులు బంగారు వర్ణంలో మెరుస్తుంటాయి. వాటి పైభాగంలోని మబ్బులు నీలిరంగులో కొండల్ని తలపిస్తాయి. ఇటువంటి అద్భుతమైన దృశ్యాల్ని ఫొటోలు తీయని వారుంటారా చెప్పండి? అక్కడ ప్రతి ఒక్కరూ చేతిలోని కెమెరాకి పని చెప్పకుండా ఉండరు.



కదిలే ఇల్లు





పెరియార్ వైల్డ్ లైఫ్ శాంక్చురీలోని ఏనుగులు



నీలకురింజి పూలు

తెక్కడి ప్రయాణం

కొండలూ లోయలతో కూడిన ఆ మార్గంలో ఎక్కడ చూసినా రబ్బరు తోటలే. చెట్లకు ఇనుప గిన్నెలు కట్టి ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంటాయి. రబ్బరు పాలు కారి ఆ గిన్నె నిండడానికి చాలా రోజులే పడుతుందట. ఆ దారిలోనే కొండల మీదనుండి ఉరికే జలపాతాలు, టీ తోటలు కనిపిస్తాయి.

భూమికి ఆకుపచ్చ రంగు వేసినట్లు ఎటు చూసినా పచ్చదనమే. కొండల మీద అంచెలంచెలుగా పెంచుతున్న టీ తోటలు కనువిందు చేస్తాయి.

తెక్కడిలో అడవి మధ్యలో ఓ సరస్సు ఉంది. అందులో కాటేజీలు ఉంటాయి. మూడంతస్తుల పడవ ఎక్కి అందులో విహరిస్తుంటే ఆ అనుభూతే వేరు... అక్కడున్న పెరియార్ వైల్డ్ లైఫ్ శాంక్చురీలోని జంతువులను తప్పని సరిగా చూడాల్సిందే. నీలగిరి కోతులు, ఏనుగులూ, అడవిదున్నలు, పులులు కనిపిస్తాయక్కడ.

గుండెకు తాళం

తెక్కడి నుండి మున్నార్ ఘాట్ రోడ్డు ప్రయాణం.... దారిలో 'లాక్ హార్ట్ గ్యాప్' అన్న బోర్డు ఉంటుంది. నిజంగానే అక్కడి ప్రకృతి అందాలు గుండెకు తాళం వేస్తాయి. ఓ వైపు కొండలమీద నుండి జారే జలపాతాలు... మరో వైపు టీ తోటలు.. పైకి చూస్తే మబ్బుల గుంపు. కింద ఆకుపచ్చని తివాచీ పరిచినట్లుండే టీ తోటలు.... వాటిపైన తెల్లని మేలి ముసుగు కప్పినట్లు మంచు.

మళయాళంలో 'మును' అంటే మూడు అని, 'ఆరు' అంటే నది అని అర్థమట. నల్లతన్ని, కుండలి, ముతిరప్పుజ అనే మూడు నదులు కలిసే ప్రదేశం కాబట్టి దీనికి మున్నార్ అనే పేరు వచ్చిందట. టాటావారి టీ ఎస్టేట్లు, మహీంద్రా రిసార్టులు ఈ ప్రాంతమంతటా ఉన్నాయి.

మబ్బుల్లో తేలినట్టుందే...

ఈ పర్వత ప్రాంతానికి దక్షిణదేశ హిమాలయాలని పేరు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 1600 నుండి 1800 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఇక్కడున్న 'అనముడి' శిఖరం ఎత్తు 2695 మీటర్లు. ఇక్కడ వందల, వేల ఎకరాల టీ తోటలు... వాటి పక్కనే ఆకాశాన్ని తాకుతున్నట్లున్న యూకలిప్టస్ వృక్షాలు ఉన్నాయి. ఇక్కడే మట్టుపట్ట ఆనకట్ట కూడా ఉంది. దీనిమీద నుండి కనిపించే తేయాకు తోటల సోయగం చెప్పడానికి మాటలు చాలవు. పశ్చిమ కనుమల్లోని ఈ యాలకుల కొండమీద ఎప్పుడూ వర్షాలు పడుతూనే ఉంటాయి.

మున్నార్‌లో అడుగడుగునా సరస్సులే. అందులో ఒకటి ఎకో పాయింట్. అక్కడి గ్రాండీస్ తోట సరస్సును ఆనుకునే ఉంటుంది. ఈ గ్రాండీస్ తోటలోని మొక్కలనుండే టిష్యూ పేపర్లు తయారు చేస్తారు. ఈ తోట సరస్సుమీదకి వాలినట్లుంటుంది. అక్కడ పెద్దగా అరిస్తే మన మాట తిరిగి మనకే వినిపిస్తుంది.

మనోహరమైన మున్నార్ తేయాకు సోయగాలను ఆస్వాదిస్తూ రెప్పవేయడం కూడా మర్చిపోతాం. నీలాకాశ పందిరి కింద పరిచిన పచ్చని తివాచీ లాంటి మున్నార్‌ను చూసి... ఆకాశపుటంచుల దగ్గర మెరుస్తున్న తెల్లని దూదిమబ్బుల్ని చూసి మనసు గాల్లో తేలిపోతుంది.

కేరళ, తమిళనాడు సరిహద్దుల్లో ఓ చిన్న గ్రామం ఉంది. నీలకురింజి పూలు ఈ గ్రామంలో బాగా పూస్తాయి. వీటి ప్రత్యేకతేమంటే ఇవి పన్నెండేళ్లకోసారి మాత్రమే పూస్తాయి.

మున్నార్ కు 17 కిలోమీటర్ల దూరంలోని రాజమలైలో ఎరావికుళం పార్కు ఉంది. ఇక్కడ అంతరించిపోతున్న నీలగిరి జింక, సాంబార్, సింహం తోక ఉండే మెకాకె, లంగూర్, కోతులు, అరుదైన పుష్ప జాతులు ఇక్కడ కనిపిస్తాయి.

అక్కడ్నుండి కొచ్చిన్‌కి వెళ్లే దారిలో లెక్కలేనన్ని జలపాతాలు కనిపిస్తాయి.ఆది శంకరాచార్యుల జన్మస్థలమైన కాలడి ఆ దారిలోనే ఉంది. అక్కడ సుబ్రమణ్యేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు, అమ్మవారి విగ్రహాలు కూడా ఉన్నాయి.

కొచ్చిన్‌లోని డచ్ ప్యాలెస్ లో అప్పటి రాజులు కేరళవర్మ, రామవర్మల చిత్రపటాలు, వారి కిరీటాలు, వారికి సంబంధించిన అనేక వస్తువులున్నాయి.

బ్యాక్ వాటర్స్ పక్కనే ఉన్న చైనీస్ ఫిషర్‌నెట్స్ కొచ్చికే ప్రత్యేకం. చైనాలో తప్ప మరెక్కగా కనిపించని ఈ వలలు ఇక్కడ కనిపిస్తాయి. స్థానికులు వీటితోనే చేపలు పడతారు.

★



కొచ్చిన్‌లోని డచ్ ప్యాలెస్



తిరువనంతపురంలోని అనంతపద్మనాభస్వామి ఆలయం



'అనంత' పద్మనాభుడు

'రాజుల సంపద రాళ్ల పాలు' అన్నది సుప్రసిద్ధ నానుడి. ఎందుకంటే రాజులు అపార వ్యయ ప్రయాసలతో ఆలయాలు కట్టించారు. అక్కడ కొలువైన దేవుణ్ని ధూపదీప నైవేద్యాలతో పూజించడమే గాక తమను తాము దైవాంశ సంభూతులుగా చెప్పుకునేవారు (నావిష్ణు పృథివీ పతి: అని పురోహితులు కీర్తించేవారు. అంటే రాజు విష్ణువుతో సమానమన్నమాట). దేవుడిపై నమ్మకం తమకు వుందని చూపించుకోవడమే గాక తమను దేవుడి ప్రతిరూపంగా భావించి ప్రజలు విధేయులుగా వుండాలంటే ఈ తతంగాలు తప్పని సరి. అలా ఆలయాల రూపంలో తమ కీర్తిని శాశ్వతం చేసుకోవడానికి వినియోగించే సొమ్ములు పన్నుల రూపంలో పిండుకున్నవీ మాత్రమే, దండయాత్రలో దండుకున్నవీ మాత్రమే! ఇంత సంపద వెచ్చించి నిర్మించిన ఆలయాలు సంపద నిలయాలుగానూ మారడానికి అనేక కారణాలు. పరరాజుల దండయాత్రలు, అంతఃపుర కుట్రలు, దోపిళ్ల నుంచి కాపాడుకోవడానికి సంపదలను దైవ మందిరాల్లో దాచిపెట్టేవారని మనం చరిత్రలో, కథల్లో చదువుకున్నాం. ఇప్పుడు తాజాగా వెలుగు చూసిన పద్మనాభుని అనంత సంపద ఆ కథలను కళ్లముందే చూపిస్తోంది.

కేరళ రాజధాని తిరువనంతపురంలోని ఈ పురాతన ఆలయంలో బయల్పడిన అపార సంపద కారణంగా పద్మనాభుడు అత్యంత ధనవంతుడైన దేవుడిగా గుర్తింపు పొందాడు. ఏడుకొండల వెంకన్నను వెనక్కు నెట్టేసి రాత్రికి రాత్రే ముందుకు వచ్చేశాడు. అక్కడ బయల్పడిన నవరత్న ఖచిత ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, బళ్లకెత్తాల్సినన్ని బంగారు నగలు, విగ్రహాలు, లెక్కకు మిక్కుటంగా వెలుగుచూడడంతో పద్మనాభాలయం అపర కుబేర సన్నిధానమై పోయింది. ఇంతకూ ఈ ఆలయం ఎప్పటిది? ఎవరు దీని ఆలనా పాలనా చూశారు? సుప్రీంకోర్టు ఎందుకు కలుగ చేసుకుంది? అక్కడ లభించిన సంపద ఏంటి? అత్యంత ఆసక్తికరమైన ఆ వివరాలు... ఈ వారం అట్టమీది కథలో ...

శ్రీ పద్మనాభ స్వామి ఆలయం నేలమాళిగల్లో శతాబ్దాల పర్యంతం రహస్యంగా దాచిపెట్టిన అంతులేని సంపదల సమాచారం ఒక్కసారిగా దేశ విదేశాలలో పతాక శీర్షికలను ఆక్రమించింది. కేమెరాల కళ్లన్నీ తిరువనంతపురం చరిత్రకు సాక్షిగా ప్రతీకగా వెలుగొందుతున్న వేల ఏళ్ల ఈ ఆలయం వైపే. స్వాతంత్ర్యానికి పూర్వం తిరువనంతపురం తిరువాన్కూరు (ట్రావెన్‌కోర్) రాజాల ఏలుబడిలో వుండేది. అదో పెద్ద కథ!

సుప్రీంకోర్టు నియమించిన ఏడుగురు సభ్యులతో కూడిన బృందం ఆలయంలో లభించిన సంపద విలువ లక్ష కోట్ల రూపాయలుంటుందని అంచనా వేసింది. పురాతత్వ వస్తువులుగా వీటికి వుండే విలువను జతచేస్తే అది కాస్తా 5 లక్షల కోట్ల రూపాయలకు పెరిగే అవకాశం వుంది. దాని అసలు విలువ ఎంతనేది ఖచ్చితంగా తెలియాలంటే నిపుణులు రంగ ప్రవేశం చేసి బేరీజు వేయవలసిందే. ఇప్పటికింకా తెరవని ఏడవ నేలమాళిగ మిగిలే వుంది. దాన్నీ తీస్తే ఎంత సొమ్ముంటుందో ఎవరికీ తెలియదు! భరతక్కోన్ అనే ఆ ఆఖరి నేలమాళిగను కూడా తెరచి చూశాకే బృందం తన తాత్కాలిక నివేదికను అత్యున్నత న్యాయస్థానానికి సమర్పిస్తుంది.

ఆలయంలో లభించిన సంపద వివరాలను ఏడుగురు బృంద సభ్యులే బయటకు వెల్లడించారు. కానీ దానిపై సుప్రీంకోర్టు వారిని మందలించింది. ఈ బృందం పరిశోధన క్రమంలో ట్రావెన్‌కోర్ చరిత్ర కూడా వెలుగులోకి వచ్చింది. మిలమిలలాడే ఈ బంగారు వెండి ఆభరణాల వెనక దాగిన స్వేదం, రుధిరం, అశ్రుపూరిత విషాద గాథలు కూడా వెల్లడికానున్నాయి. అలనాటి దండయాత్రలు, యుద్ధాల కథలు, హృదయాన్ని ముక్కలు చేసే వ్యథలు, సామాన్య ప్రజలు, రాజుల కానుకల కాంతి పుంజాలు... ఎన్నెన్నో ఈ సంపదలలో సందర్శించవచ్చు. ఈ నిధిని సరైన రీతిలో పరిశీలిస్తే గత కొద్ది శతాబ్దాలలో పరిఢవిల్లిన సంస్కృతి, జీవన విధానం తెలిసి రావచ్చు. డచ్, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీల దురాక్రమణల తీరుతో పాటు ఈ ప్రాంతంతో సహా దక్షిణ భారతదేశంలో టిప్పు సుల్తాన్ యుగానికి సంబంధించిన చారిత్రక సత్యాలు తెలుస్తాయి.

అసలు ఇక్కడ లభించిన అత్యంత విలువైన సంపద కాలం విలువలతో సహా జాబితాను రూపొందించడం ఈ సప్త సభ్య బృందం ముందున్న బృహత్తర కర్తవ్యం. సంపద విలువను అంచనాకట్టే ముందర దాన్ని వర్గీకరించడం కూడా పెద్ద పని.

సహజంగా పద్మనాభుని అంతులేని సంపద గురించి విన్న ప్రపంచం యావత్తు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయింది. ఈ సంపద యాజమాన్యం ఎవరికి చెందాలనే దానిపై కుల, మత సంస్థలు అప్పుడే విష ప్రచారం మొదలెట్టాయి. కేవలం ఉద్రేకపూరితమైన ఇలాంటి ప్రతిస్పందనలు ఈ అపార సంపదలు పోగుపడడానికి వెనక గల అసలు కారణాలను గురించి ఆలోచించే పని చేయవు. అసలు ఆలయ సంపదపై దర్యాప్తు జరపమని సుప్రీంకోర్టు ఆదేశించడానికి దారితీసిన పరిస్థితులకు మతసంస్థలు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ పద్మనాభాలయ చరిత్ర, తిరువాన్కూరు సంస్థానం చరిత్ర, ఈ సంపద ఎలా పెరిగింది వంటి వాస్తవాలు కూడా వారికి అనవసరం. రాజ్యాంగం, చట్టం ఇలాంటి పురాతన సంపదల పట్ల ఎలా వ్యవహరించాలని చెబుతున్నాయో కూడా వారికి పట్టదు.

1990ల ఆఖరు దశ నుంచి ఆలయ నిర్వహణపై తీవ్రమైన ఫిర్యాదులు విస్తారంగా అందసాగాయి. తిరువాన్కూరు చివరి రాజు శ్రీ చితిర తిరునాళ్ బలరామ వర్మ మరణానంతరం ఈ ఆలయ సంపద హరించబడుతున్నదనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

1947లో స్వాతంత్ర్యం రావడంతో తిరువాన్కూరు రాజుల పాలనకు తెర పడింది. ప్రభుత్వం చివరి రాజుకు అలంకార ప్రాయమైన రాజప్రముఖ్ హోదానిచ్చింది. ఉథర్దం తిరునాళ్ మార్తాండవర్మ ఈ గుడికి వారసుడుగా మిగిలాడు. పద్మనాభ ఆలయాన్ని తన పర్యవేక్షణలోనే వుంచుకున్నారు. దీనిపై ఆలయ నిర్వహణ గురించి చాలా ఫిర్యాదులు వచ్చాయి. భక్తిపూర్వకమైన ఈ ఫిర్యాదీదారులు, వారి న్యాయవాదులు హిందూత్వ తీవ్రవాద శక్తుల దాడులకూ, బెదిరింపులకు గురికావలసివచ్చింది. నాటి నుంచి నేటి వరకు ఆ రాజ వంశీకులే ఆలయ ఆలనా పాలనా చూస్తున్నారు. ప్రస్తుతం ఉథర్దం తిరునాళ్ మార్తాండ ఆలయ ట్రస్టీగా కొనసాగుతున్నారు. ఇదే ఆలయ పనితీరుపై ఫిర్యాదులకు దారితీసింది. 2007వ సంవత్సరంలో తిరువనంతపురంలోని న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుతో ఉథర్దం తిరునాళ్ ఆలయ పాలకుని హోదా రద్దయిపోయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఆలయంపై అధికారం సంక్రమించింది. 2011 జనవరి 31న కేరళ హైకోర్టు దీన్ని సమర్థిస్తూ, ఆలయ యాజమాన్యం ప్రభుత్వం చేతుల్లోనే వుండాలని తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉథర్దం మార్తాండ వర్మ వాజ్యం వేయడంతో సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించి ఆలయ ఆస్తులను లెక్కించాల్సిందిగా ఆదేశించింది. (అంతేకాకుండా... ఇటీవల ఆలయ పాలన అస్తవ్యస్తంగా వుందని ... దీనిని సరిచేయాలని టి.పి.సుందరరాజన్ అనే న్యాయవాది సుప్రీంకోర్టుకు విన్నవించుకున్నారు) పైగా ఆలయంలో లభించిన ధనవస్తుకనక సంపదనంతా వీడియో చిత్రీకరించాల్సిందిగా కూడా పేర్కొంది.

◆◆◆

తిరువాన్కూరు మొదట్లో హిందూ రాజ్యం(1729–1858)గానూ తర్వాత కాలంలో స్వదేశీ సంస్థానం(1858–1949) గానూ వుంది. ఎత్తువీటి పిల్లమ్మార్‌గా పేరుగాంచిన ఎనిమిది శక్తివంతమైన కుటుంబాలకు చెందిన నాయర్లు



ట్రావెన్‌కోర్ వంశ వారసుడు
ఉథర్దం తిరునాళ్ మార్తాండ్ వర్మ

పాలకుల కానుకలు!

చారిత్రక విలువ కలిగిన సంపదను కాపాడడానికి ఒక మ్యూజియంను ఏర్పాటు చేయవచ్చు. ఇలాంటి అమూల్య నిధులు మరారా, రాజస్థాన్‌లో కూడా బయల్పడ్డాయి. ఒట్టామన్ సుల్తాన్లకు చెందిన నగలను ఇటీవల నేను చూశాను. ఇంకా...వజ్రాలు, కిరీటాలు, ఇతర పురాతన వస్తువులను మ్యూజియంలో వుంచారు. రాజులు సాధారణంగా ఇంతటి అమూల్య సంపదను దాడులు, యుద్ధాల సమయంలోనే పోగుచేస్తారు. కానీ ట్రావెన్‌కోర్ దీనికి భిన్నమైనది. బంగారు, వజ్రాలతో నిండిన ఆభరణాలు రాజులు చేయించినవి. లేదా ఆలయానికి వచ్చిన కానుకలైనా కావచ్చు. ప్రజల నుంచి రాబట్టిన డబ్బుతో బంగారం, వజ్రాలు కొనుగోలు చేసినా వుండొచ్చు.

– డా॥కె.ఎన్.ఫణిక్కర్, ప్రముఖ చరిత్రకారుడు,
శ్రీ శంకరాచార్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్.

పరిస్థితులు సరిలేకపోతే దేవుడే దిక్కు!

వాస్తవానికి పద్మనాభ స్వామి ఆలయం ట్రావెన్‌కోర్ రాజుల ఖజానానే. తమకు సమర్థవంతమైన పరిపాలనా పరిస్థితులు కొరవడినప్పుడు రాజులు భగవంతుడిపైనే ఆధారపడతారు. ట్రావెన్‌కోర్ రాజులు కూడా అదే చేశారు. ఈ చారిత్రక సంపదను పోగొట్టుకోకూడదు. ట్రావెన్‌కోర్ రాజుల సరికొత్త మ్యూజియంను ఏర్పాటు చేయాలి.

–డా॥ రాజన్ గురుక్కల్
(చరిత్రకారుడు, మహాత్మా గాంధీ యూనివర్శిటీ వైస్ చాన్సలర్, కొట్టాయం)

చక్కటి పర్యవేక్షణ!

పద్మనాభుని సంపదను భద్రపరచడానికి మ్యూజియం ఏర్పాటు సరైన మార్గం. నేలమాళిగల నుంచి సేకరించిన సొమ్మును పటిష్టమైన పర్యవేక్షణ గల చోట వుంచాలి. లేకపోతే ఈ పురాతన సంపద దెబ్బతినిపోతుంది.

– కెకె. మహమ్మద్
(ఢిల్లీ పురావస్తు విభాగం సూపరిన్‌టెండెంట్)

ఆలయ మంచిచెడ్డలు చూసేవారు. తర్వాత ఆ ఆలయం ట్రావెన్‌కోర్ సంస్థానాధీశుడైన మహారాజా మార్తాండవర్మ చేతుల్లోకి వెళ్లింది. వీరి కాలంలో పద్మనాభాలయం బాగా వృద్ధి చెందింది. దేవాలయానికి అనేక మార్పులు చేయించింది కూడా రాజా మార్తాండవర్మే. ఆయన తన ట్రావెన్‌కోర్ సంస్థానానికి పద్మనాభుని కులదైవంగా ప్రకటించి సేవలందించేవాడు. అంతేకాదు! తన ప్రియాతిప్రియమైన పద్మనాభ స్వామికి ట్రావెన్‌కోర్ రాజ్యం మొత్తాన్ని అర్పించాడు. 1705లో జరిగిన ఈ క్రతువును 'త్రిప్పడిదానం' అని పిలిచారు. దీనికి సంబంధించి చారిత్రక పత్రాలు అక్షరీకరించాయి. ట్రావెన్‌కోర్ రాజ్యం కేరళ మధ్య భాగంలోని కోచి పట్టణం నుంచి తమిళనాడు దక్షిణప్రాంత చివరల వరకూ విస్తరించి వుండేది. ఈ వంశంలో ఇటీవలి వరకూ బతికిన చివరి రాజైన శ్రీ చితిర తిరునాళ్ ఏనాడూ ఆలయం ట్రావెన్‌కోర్ రాజ వంశానిదని చెప్పుకోలేదు. అందుకు పూర్తి భిన్నంగా రాజకుటుంబానికి చెందిన ప్రతిదీ ఆలయానికి చెందుతుందని చెప్పేవాడు.

ఆలయంలో నేడు బయటకు తీసిన సంపద గురించి వింటేనే కళ్లు తిరుగుతున్నాయి! అంతటి అనంత సంపద ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై పలు ఊహాగానాలున్నాయి. అదంతా నాడు ట్రావెన్‌కోర్‌లో కలుపుకున్న ప్రాంతాలకు చెందినదై వుండవచ్చు. నేలమాళిగల్లోని గోతాల్లో, భోషాణాల్లో, పెట్టెల్లో మూలుగుతున్న సంపద ఆరోజుల్లో పన్నులు, అపరాధ రుసుములు, కానుకల రూపంలో వచ్చివుండొచ్చు. పైగా స్వామివారి భక్తుల్లో అత్యధికులు వ్యాపారులు, ధనికులు. వారు సముద్రమార్గంలో వర్తకం చేసేందుకు బయలుదేరేముందు స్వామికి మొక్కేవారని, భక్తికొద్దీ తృణమో, ఫణమో సమర్పించుకునేవారని



అంటారు! స్వతహాగా సంపన్నులు కావడం, తమకు ఆదాయం స్వామివారి దయ వలన దక్కుతుందనే నమ్మకం వున్న వారు కావడంతో బంగారు నాణేలు, రత్నాలు, వజ్రవైఢూర్యాలు ఆయనకు ఇచ్చుకునేవారు! అదేకాక ట్రావెన్‌కోర్ రాజుల పాలనాకాలంలో ధనికులు, నిరుపేదలు రకరకాల పన్నులు కట్టేవారు. రాజులు పద్మనాభుడికి సమర్పించిన ఖరీదైన రత్న, కనక కానుకలు కూడా ఈ సంపదలో వుండివుంటాయి.

అయితే ఈ పరిణామాలపై సుప్రీంకోర్టు స్పందనలు అత్యంత ఆసక్తికరంగా వున్నాయి. నేలమాళిగల్లో లభించిన అమూల్యమైన పురాతన సంపదను సురక్షితంగా భద్రపరచడానికి మ్యూజియంను ఏర్పాటు చేయాలని సూచించింది. జాతీయ మ్యూజియం, భారత పురాతత్వ సర్వేకి చెందిన నిపుణుల సహాయాన్ని కూడా తీసుకోవాలంది.

పద్మనాభాలయ చరితం...

శ్రీమహావిష్ణువు కొలువు తీరిన 108 క్షేత్రాల్లో కేరళలోని అనంతపద్మనాభ ఆలయం ఒకటి. ఇది ఎనిమిదవ శతాబ్దంలో నిర్మించబడింది. ఆరు, తొమ్మిది శతాబ్దాల్లో అప్పటి ఆళ్వార్లు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు కూడా కథనాలున్నాయి. అయితే స్థానికంగా వినిపించే కథనం ప్రకారం 5వ శతాబ్దంలో 'చేరమన్ పెరుమాళ్' అనే రాజు ఈ ఆలయానికి పునాది వేశాడని.. అప్పుడే ఈ ఆలయానికి పూజారులను, పాలకులను నియమించాడని తెలుస్తోంది.

స్వామి క్షేత్రాల్లో విశిష్టమైనదిగా భావించే తిరువనంతపురంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని ద్రావిడ శైలిలో నిర్మించారు. విష్ణుమూర్తి సాధారణంగా మూడు భంగిమల్లో... శయన భంగిమలో యోగనిద్రామూర్తిగా, నిల్చొని, కూర్చొని స్వామి దర్శనం ఇస్తారు. ఈ ఆలయంలో ఆయన యోగనిద్రా మూర్తిగా కనిపిస్తారు. తమిళ ఆళ్వారుల ప్రబంధాల్లో ఈ ఆలయం ప్రస్తావన కనిపిస్తుంది. ట్రావెన్‌కోర్ రాజుల ఇలవేల్పుగా పద్మనాభుడు పూజలు అందుకున్నాడు. మార్తాండవర్మ రాజ్యాధికారంలో ఉన్న సమయంలో ఈ ఆలయ వైభవం నలుదిశలా వ్యాపించింది. 8వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయాన్ని ట్రావెన్‌కోర్ రాజు మార్తాండవర్మకాలంలో పునరుద్ధరించారు.

పద్మనాభుడు గనక నాభిలోంచి వచ్చిన పద్మాసనుడైన బ్రహ్మ వుంటాడు. యోగనిద్రామూర్తిగా శేషుని మీద శయనించి ఉన్న శ్రీమహావిష్ణువు చేతికింద శివలింగం కూడా ఉంటుంది. అంటే ఇది సృష్టి స్థితి లయ కారకులైన త్రిమూర్తుల నిలయమని కూడా చెబుతారు. గర్భగుడిలో మూల విరాట్టు వెనుక కుడి, ఎడమ గోడల మీద అపురూపమైన దేవతామూర్తుల చిత్రాలు ఉంటాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మహావిష్ణువు ఉత్సవ

మూర్తుల విగ్రహాలూ వున్నాయి. పేరకు తగినట్టే ఆ చివర నుంచి ఈ చివర వరకూ విగ్రహం వుంటుంది. ఆదిశేషుని మీద శయనించి ఉన్న అనంత పద్మనాభుని 18 అడుగుల మూర్తిని మూడు ద్వారాల నుండి దర్శించుకోవాలి. మొదటి ద్వారం నుండి స్వామి తల, ఛాతీ మాత్రమే కనిపిస్తుంది. రెండవ ద్వారం నుండి చేతులు, నడుము భాగం కనిపిస్తుంది. మూడవ ద్వారం నుండి స్వామి పాదాలు దర్శించుకోవచ్చు. అమూల్యమైన వజ్రాలు పొదిగిన ఆభరణాలు ధరించిన స్వామి విగ్రహం ధగధగా మెరిసిపోతుంది. ఆలయంలో నరసింహ, అయ్యప్ప, గణపతి, శ్రీకృష్ణ, హనుమ, విష్వక్సేన, గరుడ ఆలయాలు కూడా ఉన్నాయి. ఆలయంలోకి హిందువులను మాత్రమే అనుమతిస్తారు. పురుషులు పంచె, ఉత్తరీయం, స్త్రీలు చీర ధరించి స్వామి దర్శనం చేసుకోవాలి. కేరళలోని దాదాపు అన్ని ఆలయాల్లో ఈ సంప్రదాయం కొనసాగుతుంది. ఈ ఆలయంలో ఈ సంప్రదాయాన్ని విధిగా పాటిస్తారు. అందుకే ఎంతో ఆశగా వచ్చిన విదేశీ యాత్రికులు నిరుత్సాహం, నిరసన వెలిబుచ్చడం కనిపిస్తుంటుంది.

ఈ అనంతపద్మనాభ స్వామి ఆలయం, రాజగోపురం అపురూప శిల్పకళలకు నిలయం. శిల్పాలు, పంచలోహాలు, చెక్కతో అందంగా మలచిన దేవతామూర్తులు ఈ ఆలయంలో దర్శనం ఇస్తాయి. ద్రావిడ శైలి శిల్పకళా చాతుర్యం



ఆలయంలో అణువణువునా గోచరిస్తుంది. గర్భగుడితో పాటు వంద అడుగుల ఎత్తైన గాలిగోపురం మీద కూడా అందమైన శిల్పాలు దర్శనం ఇస్తాయి. ఆలయం ముందు పద్మతీర్థం అనే కోనేరు ఉంటుంది. ఆలయం లోపల 80 ధ్వజస్థంభాలు ఉండడం మరో విశేషం. ప్రాంగణంలో ఉన్న బలిపీఠ మండపం, ముఖమండపాల్లో కూడా దేవతామూర్తుల అపురూప శిల్పాలు కనిపిస్తాయి. ప్రధాన ఆలయ మండపం దానికదే ఒక మహాద్భుతం. 365 రాతి స్తంభాలతో ఈ మండపాన్ని నిర్మించారు. ఈ రాతి స్తంభాలతో పాటు మండపం పైకప్పు మీద కూడా దేవతామూర్తుల శిల్పాలను అందంగా చెక్కడం విశేషం.

ఏం దొరికాయి?

చరిత్ర సరే... ఇప్పటివరకు ఆలయ నేలమాళిగల్లో ఏం దొరికాయన్నది అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. అక్కడి సొత్తు విలువ వార్తల్లో వస్తున్నా అందులో ఏమేం వున్నాయన్నది తెలుసుకోవాలన్న కుతూహలం సహజంగానే వుంటుంది. మీడియాకు పొక్కిన వివరాల ప్రకారం అక్కడ...

వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు పొదిగిన నాటి రాజకుటుంబానికి చెందిన కిరీటాలు ♦ 17 కిలోల బంగారు నాణేలు ♦ 2.5 కిలోల బరువు, 18 అడుగుల పొడవు వున్న శరపోలి మాల ♦ బంగారు తాళ్లు ♦ ఒక బస్తా నిండా వజ్రాలు ♦ వేల సంఖ్యలో పురాతన నగలు, బంగారు పాత్రలు ♦ వివిధ కుటుంబాలు, యాత్రికులు, వర్తకులు చేసిన దానాలు ♦ పలు శతాబ్దాల నాటి అత్యంత అరుదైన విలువైన మాణిక్యాలు ♦ వజ్రాలు, నవరత్నాలతో పాటు బెల్జియన్ రత్నాలు ♦ రోమ్ నుంచి వచ్చిన పురాతన నాణేలు ♦ విలువైన రత్నాలు, బంగారంతో తయారు చేసిన విష్ణుమూర్తి విగ్రహం ♦ బంగారు గింజలు ♦ బంగారు పతకాలు ♦ బంగారు రాజదండాలు.

సంపదకోసం ఆలయాలపై దాడులు

గజనీ, ఘోరీ ఆలయాలమీద దాడి చేశారంటారు. వాటిని ధ్వంసం చేశారంటారు. కానీ ఆ దేవాలయాల్లో నిక్షిప్తం చేసిన సంపదను, ఖజానాను సొంతం చేసుకోడానికే వారలా చేశారు. సోమనాథ దేవాలయంపై పద్నాలుగు సార్లు దాడి చేసిన గజనీమహ్మద్ అక్కడి సొమ్మంతా కొల్లగొట్టాడు. హిందూ రాజులు సైతం సంపద కోసమే దేవాలయాలను కొల్లగొట్టిన దాఖలాలున్నాయి. చారిత్రక గ్రంథాలు, ప్రాచీన కావ్యాల్లో వాటికి సంబంధించిన జాబితాలున్నాయి. కల్హణుడి 'రాజతరంగిణి' అందుకు ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 'అర్థశాస్త్రం' రచించిన కౌటిల్యుడు కూడా ఆలయ సంపదలకు సంబంధించిన కొన్ని అంశాలను పేర్కొన్నాడు. రాజులకు సంపద అవసరమైతే దేవాలయాల్లోని గుప్తనిధులను కొల్లగొట్టుకోవచ్చని రాశాడు. సంపదకోసం జరిగిన విధ్వంసాన్ని కేవలం మతపరమైన దాడులనడంలో అర్థంలేదని తాజాగా పద్మనాభాలయంలో వెలువడిన అనంత ఖజానా తెలియచెప్తోంది.

- ఎన్.ఎస్. సజిత్ సుబ్రమణియన్,
తిరువనంతపురం.

ధనిక దేవుళ్లు!

భారతదేశం పేదదేశమైనా ధనికదేవుళ్లకేం కొదవ లేదు. నిన్నటిదాకా దేశంలోకెల్లా అత్యంత ధనవంతుడిగా వినుతికెక్కి తిరుమల తిరుపతి వెంకన్న... నేడు పద్మనాభుడి దెబ్బతో రెండవ ధనిక భగవంతుడయ్యాడు. ఏడుకొండలవాడి వంటిమీదున్న బంగారమే 1000 కేజీలుంటుంది. రోజుకి 60,000 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటుంటారు. కానుకల రూపంలో సంవత్సరానికి 650 కోట్ల రూపాయల వరకు వస్తుంది! ఇక కాశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం అత్యంత పురాతనమైనది. ఇక్కడికి రోజుకు లక్షలాది భక్తులు వస్తుంటారు. ఏడాదికి 500 కోట్ల రూపాయల విలువచేసే కానుకలు వస్తుంటాయి. షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆయనకు 32 కోట్ల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలున్నాయి. కులమతాలకతీతంగా లక్షలాదిమంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఏడాదికి భక్తుల కానుకల రూపంలో 350 కోట్ల రూపాయలు అందుతుంటాయి. తర్వాతి స్థానం ముంబైలోని సిద్ధివినాయకుడిదే. ఇక్కడికి సామాన్యుల నుంచి సినీ, వ్యాపార, రాజకీయ ప్రముఖుల వరకు తరచూ వస్తుంటారు. గణేషుడి మండపానికి 3.7 కిలోల పుత్తడిని అద్దారు. సంవత్సరానికి 48 కోట్ల రూపాయల కానుకలు వస్తాయి. తర్వాత సిక్కుల పవిత్రమైన స్వర్ణ దేవాలయం గురించి చెప్పుకోవాలి. ఇక్కడికి రోజుకు 40,000 మంది భక్తులు వస్తుంటారు. దాన్నిబట్టే కానుకల రూపంలో వచ్చే ఆదాయాన్ని అంచనా వేసుకోవచ్చు.


తిరుపతి వెంకన్న ఆలయం

స్థితప్రజ్ఞత

- గోనుగుంట మురళీకృష్ణ

సాయంత్రం అయిదున్నర అయింది. ఎండ తీక్షణత క్రమక్రమంగా తగ్గిపోతోంది.

అప్పుడే డ్యూటీ నుండి ఇంటికొచ్చాను. గేటు తీస్తుంటే ఆ శబ్దానికి వరండాలో కూర్చుని మాట్లాడుకుంటున్న మాధవి, మరొక ఆమె ఇటు చూశారు. ఆమె నన్ను చూసి గబగబా పక్కపోర్షన్‌లోకి వెళ్ళిపోయింది.

బండి స్టాండు వేసి ఇంట్లోకి వచ్చాను. మాధవి ఫ్రిజ్‌లో నుండి వాటర్ బాటిల్ తీసి, మంచి నీళ్ల గ్లాసులో పోసి అందించింది.

"ఏమండీ! మన పక్క పోర్షన్‌లోకి ఈరోజు మధ్యాహ్నం కొత్తగా ఒక కుటుంబం వచ్చింది. ఇందాక ఇటు వెళ్లింది చూశారా? ఆమే! మీరు, పిల్లలు వెళ్లిన తర్వాత ఒక్కదాన్నే ఉండాలి. పక్కపోర్షన్‌లోకి ఎవరైనా వస్తే బాగుంటుందని రోజూ అనుకుంటున్నానా! అలాగే జరిగింది" అంది మాధవి.

"పోన్లే! ఇన్నాళ్ల నుండి నువ్వు ఎదురుచూసినందుకు ఎవరో ఒకరు తోడు దొరికారు" అన్నాను.

"ఆమె భర్త టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో జె.ఇ.గా పని చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు. మన మహి, మీనూ వయసువాళ్లే!"

"అలాగా!" అని బాత్‌రూంలోకి వెళ్లాను. మా ఆవిడ వాక్ప్రవాహానికి బ్రేక్ పడింది. ముఖం, కాళ్లు, చేతులు కడుక్కొని టవల్‌తో తుడుచుకుంటూ బయటకు వచ్చేసరికి మళ్లీ మొదలు పెట్టింది.

"ఆమె పేరు నిర్గుణ"

"పేరు వెరైటీగా ఉందే!" అన్నాను.

"వాళ్లతో పాటు పనిమనిషిని కూడా వెంట తెచ్చుకున్నారు. ఆ అమ్మాయి పేరు కుసుమాంజలి. ఎంత చక్కటి పేరో చూశారా? పనిమనిషి అనగానే ఏ మంగమ్మ అనో, రంగమ్మ అనో పేరుపెట్టి కథలు రాసే మీ రచయితలందరూ తెలుసుకోవాల్సిన విషయం ఇది" అన్నది మాధవి.

"అలాగా!" అన్నాను నవ్వుతూ.

"మీరు టీవీ చూస్తుండండి. టీ తెస్తాను" అని కిచెన్‌లోకి వెళ్లింది మాధవి. నేను ఉద్యోగరీత్యా చాలా ఊళ్ళు ట్రాన్స్‌ఫరయ్యాను. వెళ్లిన ప్రతిచోటా మాధవి ఇరుగు పొరుగు వాళ్లతో ఇట్టే కలిసిపోతుంది. అంత తక్కువ టైంలో ఎలా దగ్గరయ్యారా! అనుకుంటాను. నాకు స్నేహితులతో, చుట్టుపక్కల వాళ్లతో మాట్లాడ్డానికి అంత వైమనస్య భావమేమీ లేదు కానీ, ప్రత్యేకంగా పనికట్టుకుని వెళ్లాలనిపించదు. ఎప్పుడైనా తీరిక దొరికితే ఏ పుస్తకమో చదువుకుంటూ కూర్చోవాలనిపిస్తుంది.

రెండు రోజుల తర్వాత పక్క పోర్షన్‌లోకి కొత్తగా దిగినతను వచ్చాడు. నేను ఆ వారం స్కూల్ పిల్లలకి పెట్టిన యూనిట్ టెస్ట్ పేపర్లు దిద్దుతున్నాను.

"బాగున్నారా?" పరిచయమున్నట్లే నవ్వుతూ పలకరించాడు. అతనికీ ఇంచుమించు నా వయసే ఉంటుంది.

"మొన్న చెప్పానే! గిరిధర్ గారని. పక్కపోర్షన్‌లోకి కొత్తగా వచ్చారు" మాధవి గుర్తు చేసింది.

"రండి కూర్చోండి" అన్నాను కుర్చీ చూపిస్తూ.

"నిన్న ఉదయమే పలకరిద్దామనుకున్నాను. ఉదయం పూట మీరు బిజీగా ఉంటారని ఆగాను" అన్నాడు.

"అవునన్నయ్యా! ఉదయాన్నే టిఫిన్ తయారు చేసి, క్యారేజీలు రెడీ చేసి, పిల్లల్ని కాలేజీకి, ఈయన్ని స్కూల్‌కి పంపించాలి. ఈయన చదువుకోవటానికి కాదులెండి. చదువు చెప్పటానికి అన్నది మాధవి.

నాకు నవ్వొచ్చింది.

గిరిధర్ కూడా నవ్వి "నువ్వన్నదాన్లో తప్పేముందమ్మా! ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థే!" అన్నాడు.

అతన్ని చూస్తుంటే నాకెందుకో సదభిప్రాయమే కలుగుతుంది. ముఖం ప్రశాంతంగా ఉంది. నిష్కల్మషంగా నవ్వుతున్నాడు.

"మీరు నాకు ఇంతక్రితమే తెలుసు. వ్యక్తిగా కాదు. రచయితగా" అన్నాడు గిరిధర్.

"నా రచనలు మీరు చదివారా?" అడిగాను.

"చాలా చదివాను. మీకు క్రైం, సస్పెన్స్ థ్రిల్లర్స్ రాయడం ఇష్టం ఉండదు. మోసాలు, ద్వేషాలు గురించి రాయరు. మానవ సంబంధాలు, ప్రేమానురాగాల గురించి రాస్తారు. మీ కథల్లో విలనిజం కూడా లైట్‌గానే ఉంటుంది"

నా మనసులో భావాలు అంత సూటిగా చెప్పేసరికి ఆశ్చర్యపోయాను. ఇతను నిజంగానే నా కథలు చదివి ఉంటాడనుకున్నాను. బాగుంటే ఎందుకు బాగుందో, బాగుండకపోతే ఏ అంశం నచ్చలేదో చెప్తున్నాడు. అలా అందరు రచయితలనూ విశ్లేషించాడు.

"చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు, అడవి బాపిరాజుగారు గొప్ప రచయితలు కారని ఎవరూ అనరు. కానీ వారి శైలి ఆకట్టుకునేటట్లు ఉండదు. యద్దనపూడి సులోచనారాణి రచనలు సాంసారిక సమస్యలు ఇతివృత్తంగా తీసుకున్నా, శైలి హృదయానికి హత్తుకునేటట్లు

ఉంటుంది" అన్నాడు గిరిధర్.

నిజమే అనిపించింది నాకు. ఒక్కొక్కరిది ఒక్కో శైలి అనుకున్నాను. కానీ అంత వివరంగా ఎప్పుడూ ఆలోచించలేదు. సాహిత్య చర్చల్లో మునిగిపోయిన మాకు రెండు గంటలు ఎలా గడిచాయో తెలీలేదు. గిరిధర్ వెళ్లటానికి లేచాడు. నేను కూడా లేచాను. అతను ఎన్నో ఏళ్ల నుండి పరిచయమున్న వ్యక్తిలా అనిపించింది.

గిరిధర్‌వాళ్ల పిల్లలు, మా పిల్లలు, సమవయస్కులవడం వల్ల త్వరగానే కలిసిపోయారు. కలిసి కాలేజీకి వెళ్లడం, కలిసి చదువుకోవటం చేసేవారు.

నిర్గుణకి సృజనాత్మకత ఎక్కువ. అగ్గిపుల్లలు, దూది, రంగుగుడ్డలు వంటి వస్తువులతో రకరకాల పువ్వులు, పక్షులు చేసేది. అవన్నీ మాధవికీ నేర్పింది. మాధవి కూడా తనకి వచ్చిన కుట్లు, అల్లికలు ఆమెకి నేర్పేది. ఇద్దరూ కూర్చుని చీరల మీద పెయింటింగ్‌లు వేసుకునేవారు.

నాది అంతగా కలిసిపోయే తత్వం కాకపోయినా గిరిధర్‌కూ, నాకూ అభిరుచులు కలవటం వల్ల సాహిత్యసభలకు వెళ్లటం, పాల్గొనటం సర్వసాధారణమైంది.

ఆరునెలలు గడిచేసరికి అందరం ఒకే కుటుంబంలా కలిసిపోయాం. వనభోజనాలకి, అప్పుడప్పుడు సినిమాలకి వెళ్లేవాళ్లం.

గిరిధర్ వాళ్లకి పెదనందిపాడు దగ్గర పొలం ఉందనీ, అది అమ్మకానికి పెట్టాననీ ఆ వ్యవహారాలు చూడటానికి నాలుగైదు రోజులు పట్టేటట్లు ఉందని చెప్పాడు. పిల్లల్ని తీసుకెళ్లటానికి చదువు పాడవుతుందని చెప్పాడు.

"ఫర్వాలేదు. మీరు వచ్చే వరకు మా ఇంట్లో ఉంటారు" అన్నాను.

ఆ నాలుగు రోజులూ గిరిధర్ పిల్లలు కూడా మా పిల్లలతో మా ఇంట్లోనే ఉన్నారు.

ఓసారి నాలుగు రోజుల్నుంచి ఎడతెగని వర్షాలు. వర్షాలు తగ్గిన తర్వాత ఊళ్లో అందరికీ అంటువ్యాధులు వ్యాపించాయి. మా అబ్బాయి మహీకి కూడా జ్వరం వచ్చింది. నా బాధ్యతలు సగం పంచుకుంటూ నాకు కుడిభుజంలా ఉండే పిల్లాడు అలా మంచానికి అంటుకుపోయి పడుకుని ఉంటే చూడలేకపోయాను. మాధవి ఒకటే ఏడుపు.

ఆ సమయంలో గిరిధర్, నిర్గుణ అండగా నిలబడ్డారు. ఎంతో ధైర్యం చెప్పారు. హాస్పటల్లో ఉన్నన్ని రోజులు నాకూ, మాధవికీ క్యారేజీలు తెచ్చి ఇచ్చేది నిర్గుణ. వారం రోజుల తర్వాత డిశ్చార్జి అయ్యాడు మహీ.

ఆ సంఘటనతో ఇరు కుటుంబాలు మరింత దగ్గరయ్యాయి. గిరిధర్ వాళ్లు ఈ ఊరువచ్చి రెండున్నర సంవత్సరాలైంది.

ఆ రోజు గిరిధర్ సడన్‌గా పిడుగులాంటి వార్త తెచ్చాడు. అతనికి ట్రాన్స్‌ఫర్ అయింది. ఈ వార్త విన్నప్పటినుండీ మాధవి బెంబేలు పడిపోయింది. విడిపోవాల్సి వస్తున్నందుకు పిల్లలు కూడా దిగులుపడ్డారు. నాకు కూడా మనసులో ఏదో బాధగా ఉంది. గిరిధర్ ఆ ఊళ్లో జాయినై, ఇల్లు మాట్లాడుకుని వచ్చాడు.

మాధవి, వాళ్లకోసం పంపడానికి అప్పడాలు, వడియాలు, ఆవకాయ మొదలైనవన్నీ రెడీ చేసింది. జరిగిపోయినవన్నీ తలచుకుంటూ మాటిమాటికీ కన్నీళ్లు పెటుకుంటుంది. నిర్గుణ ఓదార్చింది.

పిల్లలయితే ఒకర్ని వదలి ఒకరు ఒక్కక్షణం కూడా ఉండటం లేదు. భోజనం టైంలో ఏ ఇంట్లో ఉంటే అక్కడే భోజనం చేసి నిద్రపోయేవారు. మీ ఇల్లు మా ఇల్లు అనే తేడా లేదు.

మర్నాడే ప్రయాణం. మాధవి, నిర్గుణ వాళ్లకోసం బట్టలు కొనుక్కురావటానికి బజారుకెళ్లింది. పిల్లలు ఎక్కడో దూరంగా ఆడుకుంటున్నారు. పడక్కుర్చీలో ఆలోచిస్తూ పడుకున్నాను.

గిరిధర్, నిర్గుణ వచ్చారు.

"రండి కూర్చోండి" అన్నాను. ఇద్దరూ కూర్చున్నారు. "సామాను అంతా సర్దుకున్నారా?" అడిగాను.

"సర్దుకునేందుకు ఏమున్నాయి? మా బట్టల వరకు రెండు సూట్‌కేసుల్లో సర్దుకున్నాం. ప్యాకింగ్ అండ్ మూవర్స్ కంపెనీకి ఫోన్ చేశాను. వాళ్లే అన్నీ చూసుకుంటారు" అన్నాడు గిరిధర్.

"మీరు వెళ్లిపోతుంటే మాధవి దిగులు పడుతోంది. నాకు కూడా బాధగానే ఉంది. మళ్లీ ఎన్నాళ్లకు కలుసుకుంటామో!" అన్నాను.

"నాకు మాత్రం రవ్వంత బాధ కూడా లేదు" అన్నాడు గిరిధర్.

"అదేంటి? అన్నాను విస్మయంగా.

"మీరు, మేము బంధువులం కాము. జస్ట్... ఇరుగు పొరుగు వాళ్లం. ఎవరు ఇల్లు ఖాళీ చేసినా, విడిపోవలసినవాళ్లమే! ఎటాచ్‌మెంట్ పెంచుకుంటే బాధ పడాల్సి వస్తుంది. అందుకే పెంచుకోలేదు."

" రెండు సంవత్సరాలు ఒకే కుటుంబంగా, బంధువులకన్నా ఎక్కువగా కలసి మెలసి ఉన్నాం. ఎటాచ్‌మెంట్ లేదంటారా? అంటే ఇన్నాళ్లూ నటించారా?" అన్నాను ఆశ్చర్యంగా.

" నటించలేదు. మీరు మాకు సహాయం చేశారు. మేము మీకు సహాయం చేశాం. మీరూ స్నేహంగా ఉన్నారు. మేమూ స్నేహంగా ఉన్నాం. అంతే! అంతకు మించి ఎక్కువలేదు. మీ విషయంలోనే కాదు. ఎవరి విషయంలోనైనా నేను ఇలాగే ఆలోచిస్తాను. ఆఖరికి కన్నబిడ్డల విషయంలో కూడా. వాళ్లు చిన్నపిల్లలు కాబట్టి ఇప్పుడు మనతో ఉంటారు. రేపు పెద్దైన తర్వాత ఏ అమెరికానో వెళ్లిపోతారనుకోండి. వాళ్ల మీద అతిగా ప్రేమను పెంచుకుంటే, అప్పుడు వదిలి పెట్టి ఉండగలమా? రెక్కలు వచ్చిన పక్షులు ఎగిరిపోవటం సహజం. వాటిని బలవంతంగా పట్టుకుని ఉంచడం లేదా ఎగిరిపోయాయని బాధ పడటం అసహజం" అన్నాడు గిరిధర్.

"అయితే మనుషుల మధ్య ప్రేమాభిమానాలు ఉండకూడదంటారా?" అన్నాను.

"ఉండకూడదని ఎక్కడ అన్నాను. ఎంత వరకు ఉండాలో అంతవరకే ఉండాలి. వాస్తవాన్ని విస్మరించకూడదు."

"అలాంటప్పుడు మీరు ఆనందంగా ఉండగల్గుతున్నారా?"

"ఏం? ఇప్పుడు ఉండడం లేదా?" అన్నాడు గిరిధర్ నవ్వుతూ.

"ఈయన ఫిలాసఫీ నాక్కూడా నచ్చింది అన్నయ్యా! నేనూ అదే అలవాటు చేసుకున్నాను. మా ఇద్దరిలో ఎవరు ముందు చనిపోయినా..." నిర్గుణ ఒక్కక్షణం ఆగింది. "ఇలా మాట్లాడుతున్నానని మరోలా అనుకోకండి. మనం మాట్లాడనంత మాత్రాన జరిగేవి జరగకుండా ఉంటాయా? మా ఇద్దరిలో ఎవరు ముందు చనిపోయినా మరొకరి జీవితం శూన్యం అయిపోదు. ఎవరి ప్రపంచం వారికుంది. ఆయన సాహిత్య కార్యక్రమాలు, సాహిత్య చర్చలు, స్నేహితులు ఆయనకున్నారు. అలాగే నా సృజనాత్మక పనులు, సేవా కార్యక్రమాలు నాకున్నాయి. ఎక్కువ ఎటాచ్‌మెంట్ పెట్టుకోవడం వల్ల బాధపడక తప్పదు. అందుకే మీరు ఎంత దగ్గరికి వచ్చినా మేం మాత్రం మానసికంగా మా హద్దుల్లోనే ఉన్నాం. మనం బతికినంత కాలం మనశ్శాంతిగా ఉంటూ, సాటివారికి చేతనైనంత సేవ చేస్తూ జీవించాలి. ఇవన్నీ మాధవికి అర్థం కాదు. అందుకే ఆమె లేని సమయం చూసి మీతో చెప్తున్నాం" అంది నిర్గుణ.

"మీ గురించి అర్థమైన కొద్దీ మీరొక ప్రత్యేకమైన వ్యక్తిలా ఉన్నారు. మీకున్నంత స్థితప్రజ్ఞత (సుఖదుఃఖాలను సమంగా చూడగల శక్తి) బహుశా ఎవరికీ ఉండదేమో!" అన్నాను గిరిధర్‌తో.

"అమ్మో! అంత పెద్ద మాటలు వాడకండి. నేను స్థితప్రజ్ఞుణ్ని కాను. ప్రాక్టికల్ మనిషిని. అంతే!" నవ్వేశాడు గిరిధర్. నిర్గుణ కూడా నవ్వింది.

స్వేచ్ఛగా, స్వచ్ఛంగా నవ్వుతున్న ఆ ఇద్దర్నీ అలాగే చూస్తూ ఉండిపోయాను.

★

వికాసం

మనిషి బరువులో రక్తం బరువు 5 శాతం ఉంటుంది. రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఇందులో ఎర్రరక్తకణాలు గుండ్రంగా, బల్లపరుపుగా, బిమ్మలా, ద్విపుటాకారంగా ఉంటాయి. వీటిలో హిమోగ్లోబిన్ అనే రంగు పదార్థం ఉండడం వల్ల ఈ కణాలు ఎర్రగా ఉంటాయి. శరీరంలో ఉండాల్సిన రక్తం తగ్గినా, రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గినా, రక్తంలో ఎర్రరక్తకణాలు తగ్గినా మనిషికి 'ఎనీమియా' వస్తుంది. ఎనీమియా అంటే 'రక్తహీనత' లేదా 'రక్తలేమి'. అసలు ఎనీమియా ఎందుకు వస్తుంది? కారణాలేంటి? రాకుండా ఎటువంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం.



- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

ఎనీమియా ఎందుకు వస్తుంది?

మగవారికి డెసీమీటరు రక్తంలో 13 నుండి 15 గ్రాముల హిమోగ్లోబిన్ కౌంట్ ఉండాలి. ఆడవారి విషయంలో 12 నుండి 14 గ్రాములు ఉండాలి. 6 సంవత్సరాల లోపు పిల్లలకు 11 గ్రాములు, 6 సంవత్సరాలు దాటిన పిల్లలకు 12 గ్రాములు, గర్భిణీలకు 11 గ్రాములు ఉండాలి.

హిమోగ్లోబిన్ తగ్గడానికి కారణాలు

హిమోగ్లోబిన్ తయారీకి ఇనుము, ఫోలికామ్లం, బి12 విటమిన్, ప్రొటీన్ అవసరమౌతాయి. శరీరంలోని బోన్‌మారోలో ఎర్రరక్తకణాలు తయారయి రక్తంలో చేరి 120 రోజులు ప్రయాణం చేసి చివరకు లివర్, స్ప్లీన్ వంటి అవయవాల్లో చేరిపోతాయి.

బోన్‌మారోలో ఉత్పత్తి తగ్గినా, తిండిలో పౌష్టికత లోపించినా, రక్తస్రావం అధికంగా జరిగినా లేదా ఎర్రరక్తకణాలు నశించినా 'రక్తహీనత' తలెత్తుతుంది. సాధారణంగా బోన్‌మారోలో ఉత్పత్తి తగ్గడం అంత ఎక్కువగా ఉండదు.

తినే తిండిలో ఫోలికామ్లం లేకపోవడం వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నమౌతుంది. మనదేశంలో ఎనీమియా ఉన్న మహిళల్లో సగం మందికి ఈ ఫోలికామ్ల లోపం ఉంది.

ఎనీమియాకు మరొక కారణం కూడా ఉంది. పేగుల్లో 'హుక్ వార్మ్' ఉండి అది అక్కడి రక్తాన్ని పీల్చేస్తూ ఉంటుంది. చిన్న పేగుల్లో ఉండే పారసైట్ ఇది. ఈ హుక్ వార్మ్ వల్ల ఐరన్, ఫోలికామ్లం, బి12 లోపాలు తలెత్తుతాయి.

'హుక్ వార్మ్' చాలా సులువుగా శరీరంలో ప్రవేశిస్తుంది. అందుకే మలమూత్రాలు విసర్జించినప్పుడు కూడా పాదరక్షలు వదలకూడదని గుర్తుంచుకోవాలి. పాదరక్షలు ధరించని పాదచారులు ఏడాదికి కనీసం రెండు సార్లు వారి రక్తంలోని హిమోగ్లోబిన్ స్థాయిని పరీక్షించుకోవాలి.

కాఫీ, టీ అలవాటు ఎక్కువగా ఉన్నవారిలో కూడా ఐరన్ లోపం ఉంటుంది. తినే తిండి వల్ల లభించే ఐరన్‌లో 10 నుండి 12 శాతం ఐరన్ ఒక కప్పు టీ వల్ల తగ్గిపోతుందని వైద్య నిపుణుల అంచనా.

రక్త హీనత లక్షణాలు

రక్తహీనతను సులువుగా తెలుసుకోవచ్చు. వీరి చర్మం పాలిపోయినట్లు ఉంటుంది. శరీరంలోని రక్త స్థాయి తెలుసుకునేందుకు కింది కనురెప్పను దిగువకు లాగి రక్త పరిస్థితిని తెలుసుకుంటారు. గోళ్లు పెళుసుగా ఉండడం (తేమ వుండదు), నాలుక మీద పుళ్లు ఏర్పడడం వంటి లక్షణాలు ఉంటాయి. రక్తహీనత గల వారికి ఆయాసం ఉన్నట్లనిపిస్తుంది. సాధారణ స్థాయికి మించి గుండె కొట్టుకుంటుంది. అప్పుడప్పుడు గుండె అదురుతున్నట్టు వుంటుంది. ఏ పని చేయడానికి శక్తి సరిపోదనిపిస్తుంది. సులువుగా అలసిపోతుంటారు. గాయాలైతే త్వరగా మానవు. ఏ విషయంపైనా దృష్టి కేంద్రీకరించలేరు.

హిమోగ్లోబిన్ పాత్ర ఏంటి?

♦ శరీర కణాలకు ఆక్సిజన్‌ను తీసుకెళ్లేది ఈ రక్త ప్రొటీన్ హిమోగ్లోబిన్. ఊపిరితిత్తుల నుండి ఆక్సిజన్‌ను ఇది శరీర వివిధ భాగాలకు రవాణా చేసి తిరిగి కార్బన్ డై ఆక్సైడ్‌ను ఊపిరితిత్తులకు చేరవేస్తుంది. ఇలా ఎలా జరుగుతోందో ఇంకా సైన్సు కనుగొనలేకపోతోంది. ♦ ఆక్సిజన్ పట్టుకొన్న కొద్దీ దానిమీద హిమోగ్లోబిన్‌కు మోజు పెరిగిపోతుంది. అందుకే హిమోగ్లోబిన్ దొరికిన మేర ఆక్సిజన్‌ను పట్టుకుని కదులుతుంది. ఒకసారి ఇది కణానికి ఆక్సిజన్ విడుదల చేయడం ప్రారంభించిందంటే తన దగ్గరున్న ఆక్సిజన్‌ను పూర్తిగా ఇచ్చేస్తుంది. ♦ ఆక్సిజన్ పట్టుకునేటప్పుడు ఈ హిమోగ్లోబిన్ బాగా వ్యాకోచిస్తుంది. విడుదల కోసం సంకోచిస్తుంది. ఈ రకంగా ఆక్సిజన్ పట్టు విడుపుల కోసం హిమోగ్లోబిన్ సంకోచ వ్యాకోచాలు చేయడం మానవ మేధకు అందని మరొక రహస్యం. ♦ యవ్వనంలో ప్రవేశించే ఆడపిల్లలు తినే తిండిలో 'ఐరన్' లోటు ఉంటుంది. దీని ప్రభావం యవ్వనంలో ప్రవేశించగానే కన్పిస్తుంది. వారికి ఎక్కువగా రుతుస్రావం అవుతుంటే సులువుగా వారి శరీరంలో 'రక్తహీనత' ప్రతిబింబిస్తుంది. ♦ ఎనీమియా నివారణకోసం ఐరన్ టాబ్లెట్లు వాడుతుంటారు. దీనివల్ల ఒక ప్రమాదం ఉంటుందని ఇటీవల పరిశోధనల్లో వెల్లడయింది. శరీరంలో నిద్రాణ స్థితిలో ఉన్న క్షయ, మలేరియా వంటి వ్యాధులు ఈ టాబ్లెట్ల వల్ల త్వరగా విజృంభించే అవకాశం ఉంది.

ఏం చెయ్యాలి?

♦ మంచి ఆహారం అంటే పౌష్టికాహారం ముఖ్యంగా 'ఐరన్' సమృద్ధిగా లభించే ఆహారం తీసుకోవాలి. ఎనీమియా తగ్గడానికి ఇదే మంచి ఔషధం. ♦ ఆకుపచ్చని ఆకుకూరల్లో బోలెడంత 'ఐరన్' ఉంటుంది. గాలి తగిలితే నల్లగా మారిపోయే ఏ పండులోనైనా బోలెడంత ఐరన్ ఉంటుంది. అరటిపండు దీనికి ఉదాహరణ. ♦ ఆపిల్, బొప్పాయి వంటి పళ్లు శరీరానికి 'ఐరన్' పీల్చుకునే శక్తిని పెంచుతాయి. నిమ్మపళ్లు విటమిన్ 'సి'కి ప్రతినిధులు. అనుదినం ఆహారంలో నిమ్మపండును సేవించడం మంచిది. భుజించే ఆహారంలో ప్రతిరోజూ కనీసం 75 మిల్లీగ్రాముల 'సి' విటమిన్ ఉండాలి. అందుకే ప్రతిరోజూ సగం నిమ్మపండైనా తినడం మచిది. ♦ బత్తాయి, ఉసిరి వంటి 'సి' విటమిన్ గల పదార్థాలు కూడా తీసుకోవడం ఉత్తమం. తినే ఆహారంలో ఫోలికామ్లం, విటమిన్ 12లు గల పాలకూర వంటి ఆకుకూరలు, కాలేయం, ముడి ధాన్యాలు తగినంత మోతాదులో ఉండాలి. కిస్‌మిస్ వంటి ఎండుఫలాల్లో కూడా 'ఐరన్' ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తినే తిండిలో వాటిని కూడా చేర్చుకోవడం గుర్తుంచుకోవాలి. ♦ బీన్స్, వంకాయ, బంగాళదుంప, బఠాణీ, గోధుమ వంటి వాటిల్లో కూడా ఐరన్ ఎక్కువగానే ఉంటుంది. వ్యాయామం, మంచి గాలి, మనిషి శరీరాన్ని చైతన్యవంతం చేస్తాయి. ప్రతిభావంతంగా శరీర యంత్రాంగం పనిచేస్తుంది. దీనివల్ల ఐరన్‌ను పీల్చుకునే శక్తి రక్తానికి పెరుగుతుంది. ♦ క్రీడాకారులు తగినంత ఐరన్‌ను ఆహారం ద్వారా తీసుకోకపోతే తప్పనిసరిగా విడిగా ఐరన్ తీసుకోవాలి. చాలామంది శిశువులు తగినంత ఐరన్ నిల్వలతో పుడతారు. బిడ్డకు తొమ్మిది నెలల వయసు వచ్చేసరికి ఆ బిడ్డ శరీరంలో ఐరన్ నిల్వలు తరిగిపోతాయి. తల్లిపాలు తాగే బిడ్డలో ఇటువంటి లోటు భర్తీ అవుతుంది. స్తన్యం మాన్పించి ఇతర ఆహార పదార్థాలు బిడ్డకు ఇచ్చేటప్పుడు ఆ ఆహారంలో తగినంత ఐరన్ ఉంటే బిడ్డకు ఐరన్ లోటు రాదు. ★

మహాయోధుడు అలెండి



ప్రపంచ వాణిజ్య సముదాయంపై దాడి జరిగిన 9/11కు అమెరికా ఎనలేని ప్రచారం ఇచ్చింది. భస్మాసురుడి హస్తం లాగా తను పెంచి పోషించిన ఉగ్రవాదం తనమీదే దాడికి దిగింది. దాని నుండి పాఠాలు తీసుకోని అమెరికా ఆ పేరుతో ప్రపంచంలోని అనేక దేశాలపై ఇప్పటికీ దాడులకు తెగబడుతూనే వుంది. తన మాట వినని దేశాలపై బాంబుల వర్షం కురిపిస్తున్నది. అమాయకులను బలిగొంటోంది. పెట్టుబడిదారీ విధానం కార్మికవర్గాన్ని ఎన్నికలద్వారా అధికారానికి రానిస్తుందా లేదా? అనే చర్చ ఒకప్పుడు జరిగింది. 1970 నవంబర్ 3న చిలీ అధ్యక్షుడిగా డా౹౹సాల్వేడార్ అలెండి ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక జరగకముందు, జరిగిన తరువాత ఆ ప్రగతిశీల శక్తులను అధికారంలోకి రాకుండా చేయడంకోసం, వచ్చిన తరువాత దానిని కూల్చడం కోసం అమెరికా చేయని ప్రయత్నంలేదు. చిలీలోని మితవాద శక్తులకు ఈ పనికోసం వేలకోట్ల డాలర్ల డబ్బు కేటాయించబడింది. ప్రముఖ పత్రికలు కొనుగోలు చేయబడ్డాయి. చివరకు సైన్యంలో కొందరిని తమకు అనుకూలంగా మలచుకొని ఎన్నికలద్వారా అధికారంలోకి వచ్చిన అలెండి ప్రభుత్వాన్ని కూల్చివేశారు. 1970లో ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారి పాపులరీ యూనిటి ఫ్రంట్ పేరుతో కమ్యూనిస్టులు ఎన్నికల ద్వారా అధికారంలోకి రావడం ప్రపంచాన్ని ఆలోచింపచేసింది. చిలీ లాటిన్ అమెరికా దేశాల్లో ఒకటి. దక్షిణ పసిఫిక్ సముద్రతీరాన పొడుగ్గా మ్యాపులో వానపాములవలె కనిపిస్తుంది. 2,86,396 చ.మైళ్ళ విస్తీర్ణం కలిగిన ఆ దేశ జనాభా 1971లో కోటి మంది 1970 వరకు అమెరికన్ సామ్రాజ్యవాదుల పెత్తనానికి, దోపిడీకి గురౌతూ వచ్చినదేశం. రాగి గనులకు ప్రసిద్ధిచెందిన దేశంలోని గనులన్నింటినీ అమెరికన్ కంపెనీలు దోచుకునేవి. క్రిష్టియన్ డెమోక్రటిక్, నేషనల్ పార్టీలు దఫాలవారీగా పరిపాలిస్తున్నా అమెరికన్ దోపిడీదారులకు రెండుపార్టీలు దాసోహమనేవి. 1970 అధ్యక్ష ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ, సోషలిస్టుపార్టీ, మరో 4 ఇతర పార్టీలు కలసి ప్రజా ఐక్య సంఘటనగా ఏర్పడి తమ అభ్యర్థిగా అలెండిని ప్రకటించాయి. 1970 సెప్టెంబర్ 4న 36.3% ఓట్లతో మొదటి స్థానంలో నిలిచి నవంబర్ 3న అధ్యక్షునిగా పదవీస్వీకారం చేశారు. 1971 ఏప్రిల్‌లో మున్సిపల్ ఎన్నికలు జర్గగా ఈ ఐక్యసంఘటనకు 50.9 % ఓట్లు వచ్చాయి. 1973 మార్చిలో జరిగిన సాధారణ ఎన్నికలో 43.6% ఓట్లు వచ్చాయి. ఇదే పరిస్థితి కొనసాగనిస్తే ప్రపంచంలో తమ దోపిడీకి ఆటంకాలు ఏర్పడతాయని భావించిన అమెరికా బరితెగించి అనేక కుట్రలకు పాల్పడింది. 1973 సెప్టెంబర్ 11న అమెరికన్ తొత్తు పినోచెట్ నాయకత్వంలోని ఫాసిస్టుగుంపు అధ్యక్ష భవనంపై దాడికి తెగబడింది. 65 సంవత్సరాల వయస్సు గల అలెండి లొంగుబాటు ప్రదర్శించక పోరాడుతూ నేలకొరిగాడు. అనంతరం చిలీలో సైనికపాలన ఏర్పడి కమ్యూనిస్టుపార్టీ, అభ్యుదయ శక్తులపై నిర్బంధాన్ని ప్రయోగించి అణిచివేసింది. భారతదేశంలో ఎన్నికల్లో అధికారంలోకివచ్చి 34 సంవత్సరాలు పరిపాలించిన బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వాన్ని కూల్చడానికి కూడా అటువంటి ప్రయత్నమే జరిగింది. ప్రస్తుత సమయంలో సామ్రాజ్యవాదం యొక్క కుట్రలను అర్థం చేసుకోవడానికి ఈ సమయంలో ఉపయోగపడే మంచి పుస్తకం "మహాయోధుడు అలెండి". కాస్ట్రో ప్రసంగాన్ని కమ్యూనిస్టు యోధుడు మోటూరు హనుమంతరావు తెలుగులో అనువదించారు. చిలీలో జరిగిన ఘటనల క్రమాన్నికూడా అదనంగా చేర్చారు. అభ్యుదయ కాముకులు తప్పక చదవవలసిన పుస్తకం.

మహాయోధుడు అలెండి - కాస్ట్రో, అనువాదం : మోటూరు హనుమంతరావు,
వెల : రూ. 30/-. పేజీలు : 70, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్,
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20

- కారుసాల

కొత్త పుస్తకాలు

సామాన్యుడికి అందని "బ్లాక్ కర్టెన్స్"

ఇదొక వచన కవితా సంకలనం. వచన కవిత భావ ప్రాధాన్యమైనది. వీరి కవిత్వం లిట్మస్ టెస్టులకు అందనిది. జేమ్స్ జాయిస్ 'యులిసెస్' నవల రాశాడు. ఆ నవలను అర్థం చేసుకోడానికి ఓ 'కీ'నోట్ బుక్ విడుదల చేశాడు. సరిగ్గా అలాంటి 'కీ' నోట్‌బుక్ కుమార్ కవిత్వానికి అవసరం. కవిత్వాన్ని విజువల్ ఎఫెక్ట్‌గా చూపాలనే తాపత్రయం కనిపిస్తుంది. ఆధునికత నుండి అత్యాధునికతకు వెళ్లాలనే వేగం వీరి కవిత్వంలో క(వి)నిపిస్తుంది. వేగుంట మోహన్ ప్రసాద్ (మో), వద్దేర చండీదాస్, సిద్ధార్థలాంటి వారి కవిత్వాల్ని కుమార్ కవిత్వం గుర్తు చేస్తుంది. ఈ తరహా కవిత్వం కొందర్నే ఆకర్షించుతుంది. ఆనందపరుస్తుంది. "ఖలీల్ జిబ్రా అన్నట్లు "దుఃఖాన్ని రూపుమాపేదే కవిత్వం". కుమార్ కవితల్లో ఎంతో నిగూఢ భావం దాగి వుంటుంది. కవిపండితులకే అందని పజిల్ లాంటి పదబంధ కూర్పు కవికే తెలుసు. మార్మిక భాషతో కుమార్ కవిత్వం సామాన్య పాఠకులకు నిస్సందేహంగా అందనిదే... ఇలియట్స్, కీట్స్, బైరన్, షెల్లీ, సిసిల్ డె లెవిస్, స్టీఫెన్ స్పెండర్ లాంటివాళ్లు మార్మిక మాయాజాలంతో కవిత్వాన్ని మేధావులపై వదిలారు. ఆ రోజులు, ఆ పరిస్థితులు వేరు. నేటి స్థితిగతులు వేరుకదా! కుమార్ కవిత్వంలో ఎంతో నిగూఢ భావం దాగి వుంటుంది. పండిత, విమర్శాగ్ర శిఖామణులకు అందని తాత్వికత, భావార్థం, స్త్రీ మనోభావ సంవేదన ఉంటుంది. శబ్దానికి, అర్థానికి సంబంధం కనిపించదు. ఒకవైపు కవిత్వంలో ఎన్నో ప్రక్రియలు.. భాషా అస్తిత్వ వాదాలు, మరోవైపు నూటికి 80శాతం ప్రజలు రోజుకు ఇరవై రూపాయలు కూడా ఆదాయం లేని (దు)స్థితిని అర్జున్ సేన్‌గుప్తా భారత పార్లమెంట్‌కు నివేదన - నివేదిక సమర్పించిన తరుణంలో సమిష్టి శ్రామిక ఉద్యమాలు ఉవ్వెత్తున కెరటాలై సాగించే కాలంలో కుమార్ కవిత్వం పదుల సంఖ్యలోని పాఠకులకే పరిమితంగా అర్థం అయ్యే అక్షర విన్యాస ప్రయోగాలు - ఏం ప్రయోజకాలో కవి కుమార్ శెలవియ్యాలి. "ఛాతీ నిండా పచ్చని రక్తాన్ని చేర్చిన జాగరణ/ ప్రయాణాన్ని ఉన్నట్లుండి తోసేస్తూ నిండే ఎడారి"... (పేజీ111). "పేగులుగా చీలిన వంతెనని దాటేస్తూ "దీవి" బొడిపెలు/ లోయల్నిండా కళేబరాలు... నీరిల్లిన బరిసెలు (పేజీ115)" ఇలా సాగుతుంది వీరి కవిత్వం. భగవంతం, షేక్ ఖాదర్ షరీఫ్, శ్రీరామ కవచం సాగర్... తమ తమ అభిప్రాయాలు రాశారు. ఇంగ్లీషు హారర్ చిత్ర పోస్టర్‌లా... నైటీ ధరించిన స్త్రీ బొమ్మ వెనుక నీరు గల నల్ల తెర ముఖచిత్రాన్ని ఆకట్టుకొనేలా ముద్రించారు. పోస్ట్ మోడర్నిజం (ఆదునికానంతరవాదం) కవిత్వం వేగం ఒక స్థాయి వరకే నిలబడుతుంది. ప్రయోగాలు సరే! ప్రయోజనాల మాటేమిటి??

బ్లాక్ కర్టెన్స్ - బి.ఎస్.ఎమ్.కుమార్, పేజీలు : 172, వెల : 100/-,
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలలు.

- తంగిరాల చక్రవర్తి



ఏది పెద్దది!

బుజ్జాయిలూ...పైన రెండు బొమ్మలు ఉన్నాయి. వాటి మధ్య ఒక నిలువు గీత కూడా ఉంది కదా.

ఆ రెండింటిలో ఏది పెద్దది? ఏది చిన్నది?





ఒకేసారి...

పెన్ను పైకెత్తకుండా గీతమీద గీత గీయకుండా ఒకే సారి ఒకేగీతతో ఇక్కడున్న బొమ్మను గీయగలరా? ప్రయత్నించండి.

కవలలు ఏవి?

హేయ్.. ఇక్కడ ఆరు పూలున్నాయి! అవన్నీ చూడ్డానికి ఒకేలా ఉన్నాయి. కానీ వాటిలో రెండు మాత్రమే కవలలు. అవేంటో చెప్పకోండి చూద్దాం.





రెండుతో ఆరు

నేస్తాలూ!
ఈ బొమ్మను రెండు గీతలతో ఆరు భాగాలు చెయ్యాలి.
చెయ్యగలరా.

జవాబులు

రెండుతో ఆరు...

ఒకేసారి...



కవలలు ఏవి : 1,6.

ఏది పెద్దది? : రెండు గీతలు సమానమే. కావాలంటే స్కేలుతో కొలిచి చూడండి.

ఏది ఎక్కడ?

ఫ్రెండ్స్... ఇక్కడో పిల్లి ఆకారం ఉంది. పక్కనే దానికి సంబంధించిన విడి భాగాలు ఉన్నాయి. మీరేం చేయాలంటే వాటిని ఎలా అమరిస్తే పిల్లి కరెక్టుగా వస్తుందో చూసి పెట్టేసెయ్యండి.



రంగులు నింపేద్దాం...!

చిన్నారులూ... పై బొమ్మ చక్కగా ఉంది చూశారుగా. దీనికి ఏరంగులు వేస్తే ఇంకా బావుంటుందో చూసి చకచకా వేసేయండి.

పిల్లన గ్రోవి పాటలా...

ఈ వారం మనం చెప్పకోబోయే పక్షిపేరు ఉల్లంకి. ఇది ప్రత్యేకమైన గణానికి చెందింది. మనదేశానికి వలస వచ్చే పక్షులన్నింటిలోకి ఇవే ముందుగా వస్తాయి. వెళ్లేప్పుడు మాత్రం వలస పక్షులన్నీ వెళ్లి పోయాక ఇవి వెళ్తాయి. ఈ పక్షులు పిట్ట సైజులో ఉంటాయి. వీటి పైభాగం లేత గోధుమరంగులో, కింది భాగం తెల్లగా ఉంటుంది. ఉదరానికి ఇరువైపులా ముదురు సిమెంటు రంగులో వుంటుంది. కాళ్లకు ఈకలుండవు. ముక్కు సన్నగా ఉంటుంది. మెడమీద నల్లని చారలుంటాయి. రెక్కలమీది తెల్లని చార ఎగిరేటప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. ఇవి గుంపులుగా కాక ఒంటరిగానే ఉంటాయి. ఇవి నేలమీద కూడా చాలా తేలికగా శరీరాన్ని ఆడించుకుంటూ పరుగెత్తుతాయి. తమాషా ఏమంటే... ఆ సమయంలో తల, మెడ ముందుకు, వెనుకకు ఊపుతాయి. నీళ్లుండే ప్రదేశాలు, బురదనేలలు వీటి నివాసాలు. ఈ పక్షులను 'స్నిప్పెట్లు' అంటారు. ఇవి గుడ్లు పెట్టే సమయంలో కాశ్మీర్ ప్రాంతం వైపు వెళ్తాయి. ఆనందంగా ఉన్నప్పుడు వీటి అరుపు పిల్లనగ్రోవి పాటలా వుంటుంది. ఈ పక్షులు నీటి అంచులవెంబడి ఆహారాన్ని ఏరుకుంటాయి. కీటకాలు, చిన్న నత్తలను ఆహారంగా తీసుకుంటాయి.



హోంవర్క్

తల్లి: ఏరా చింటూ! ఖాళీగా అలా కూర్చోకపోతే ... స్కూల్లో టీచర్ చెప్పింది మళ్లీ చదువుకోవచ్చుగా.

చింటూ: ఇవాళ హోం వర్క్ చేయలేదని స్కూల్లో మా టీచర్ నన్ను బెంచీమీద నిలబెట్టారమ్మా.

ఖాళీ

తల్లి: ఏంట్రా! నోట్సంతా ఖాళీగా వుంది. టీచర్ ఇవాళ ఏం చెప్పలేదా?

కొడుకు: చెప్పారమ్మా.

తల్లి: మరి రాసుకోలేదే!

కొడుకు: రాశానుగా!

తల్లి: రాస్తే నోట్సులో కనిపించడంలేదేంటి?

కొడుకు: టీచర్ బోర్డు మీద డస్టర్‌తో చెరిపేయగానే నేను ఎరేజర్‌తో నోట్సులోది చెరిపేశాను.



మాటల కోట - 61

రూపకల్పన : కర్లపాలెం

■	1	2			3	4	■	5
6	■		■	■	7		■	
■	8		9	■		■	10	
11		■	12		■	■	■	■
13		■		■	14	■	15	16
■	■	■	■	17		■	18	
19		■	20	■	21	22		■
	■	23		■	■		■	24
	■	25						■

అడ్డం :

1. సావిత్రి, పద్మనాభం భార్యాభర్తలుగా నటించిన చిత్రం (6)
7. అమెరికా రాకెట్ ప్రయోగ కేంద్రం (2)
8. సైన్యం (3)
10. రఘురామయ్యగారు, శివప్రసాద్ ఈ పాటకు ప్రసిద్ధులు (2)
11. హీరో శ్రీకాంత్ భార్య. ఆమె కూడా ఒకప్పటి హీరోయినే. ఆలోచించండి! (2)
12. చలిచీమల్లో వణికించేది (2)
13. 'బిరబిరా' గోదారి పరుగులెడుతుంటే... సగం వదిలేశారు? (2)
15. మరక (2)
17. యంత్రమేనండీ బాబూ (2)
18. అవ్వ పెట్టే భోజనం (2)
19. దోశను ఇలా కూడా పిలుస్తారు (2)
21. వంకర తిరిగిన ఆభరణాలు (3)
23. ముందు భాగం చూసుకోకుండా 'ఈసురో' మనండి! (2)
25. తెలుగు రాష్ట్ర రాజధాని (6)

నిలువు :

2. గలాభా చేసే గొడవ (3)
3. మరీ పెద్ద తుఫాను సుమీ! (3)
4. తిరగబడిన సంవత్సరం (2)
5. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యే కాదు, చీరల పేరు చెప్పినా చటుక్కుమని గుర్తొచ్చే చిన్న బొంబాయి (3)
6. ఒక్క అక్షరంలో రమ్ము! (1)
8. హుషార్ చేసే కాపలా (3)
9. పనిచేయడం కోసం తీసుకునే ముడుపు (3)
11. ఈ బురదలో పడితే పైకి తేలడం వుండదు. లోలోకి పోవడమే (2)
14. అరవని తమిళం (3)
15. బడాబాబుల గొప్పలు (3)
16. గూడులా ఉన్న పిట్ట (2)
19. శ్రీశ్రీ అంతంలేని రచన (3)
20. మకారం లేని ఆరోగ్యము (3)
22. హైదరాబాదు శివారులోని శివునిగుట్ట (3)
23. సగం సుభాషితం (2)
24. పొమ్మని ఒక్క అక్షరంలో చెప్పు! (1)

మాటలకోట - 60 జవాబు

1 పా	లు	■	2 ఆ	3 జా	ద్	■	4 తే	5 గ
వ	■	6 కు	మా	రి	■	■	■	ద్ద
7 లా	8 గు	■	గం	■	9 పా	■	10 ప	ర్
■	11 స	12 రి	గ	13 మ	ప	14 ద	ని	■
15 హై	■	చ	■	ది	■	మ్ము	■	16 పూ
17 కూ	18 లి	■	19 క	■	■	■	20 పో	రి
■	21 ఆ	22 శా	■	23 డు	■	24 వే	గు	■
25 రం	■	26 పం	చ	తం	27 త్ర	ము	■	28 హో
29 గం	ధం	■	■	30 గే	యం	■	31 ఆ	దా

తరగని సంపద



శౌవల్యాపురంలో భూషణరావు బట్టల వ్యాపారం చేస్తాడు. నిరాడంబరంగా ఉండేవాడు. సేవాభావం కలవాడు. మంచివాడిగా, మనసున్నవాడిగా ఊరి ప్రజల్లో పేరు తెచ్చుకున్నాడు. ఎవరు ఆపదలో ఉన్నా వారికి తనవంతు సాయం అందించేవాడు. భూషణరావుకి ఒక్కడే కొడుకు. పేరు గోపీ. అల్లారుముద్దుగా పెంచారు. కొడుకు ఏదడిగినా కొనిచ్చేవారు. గోపీని స్కూల్లో చేర్చారు. మొదట్లో చక్కగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్నాడు. స్కూల్లో అందరూ వాడిని అభినందించేవారు. చదువులో మంచి పేరు తెచ్చుకున్నాడని గోపీ తల్లిదండ్రులు కూడా సంతోషించారు. కొడుకుని అందరూ పొగుడుతుంటే భూషణరావుకి గర్వంగా ఉండేది.

గోపీ ఐదో తరగతికి వచ్చాడు. వాడికి శ్యామ్, వేణు అని ఇద్దరు స్నేహితులున్నారు. వాళ్లకేమో అత్తెసరు మార్కులు వచ్చేవి. గోపీ ప్రతి పరీక్షలో స్కూల్ ఫస్టు తెచ్చుకుంటుంటే వాళ్లకి ఈర్ష్యగా ఉండేది. గోపీ వాళ్లతో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకొమ్మని చెప్పేవాడు.

“ఒరేయ్ గోపీ! ఈ చదువులన్నీ మనకెందుకు? మనం శ్రీమంతులం. అయినా కష్టపడి చదివి ఏం చెయ్యాలి? అమ్మా నాన్నా సంపాదిస్తున్నారు. మనం హాయిగా జల్సా చెయ్యాలి. ఈ చదువులన్నీ ఆస్తి లేనివాళ్లకి. మనం గొప్పోళ్లం. మనకి తరతరాలు తిన్నా తరగని ఆస్థి వుంది” అన్నాడు శ్యామ్.

“అవున్రా! వాడు చెప్పిందే నిజం. అయినా ఈ పుస్తకాలు చదవాల్సిన ఖర్మ మనకేంటి? ఎంచక్కా టీవీ, సినిమాలు చూస్తూ ఆడుకోవాలి గానీ” అన్నాడు వేణు.

అలా సమయం దొరికినప్పడల్లా స్నేహితులిద్దరూ గోపీలో విషబీజాలు నాటారు. వినగా వినగా గోపీకి వాళ్లు చెప్పిందాన్లో నిజం ఉందనిపించింది. కష్టపడి చదివినా ఏం చెయ్యాలి?. ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఎలాగూ లేదనుకున్నాడు. దాంతో చదువుమీద ఆసక్తి పోయింది. స్కూలుకని చెప్పి సినిమాలకి వెళ్లడం, స్కూల్ టైమైపోయేదాకా ఎక్కడో కాలక్షేపం చేసి ఇంటికి వెళ్లడం చేస్తున్నాడు. రోజంతా వ్యాపారం పనులు, సమాజ సేవలని ఊపిరాడని పనులున్న భూషణరావుకి గోపీ గురించి పట్టించుకునే తీరిక ఉండేది కాదు.

గోపీ స్నేహితులతో పార్కుకి రావడం, సాయంత్రం దాకా అక్కడే ఆడి వెళ్లడం ఒక తాత గమనించాడు.

ఒక రోజు ఆయన వాళ్లదగ్గరికి వెళ్లి “మిమ్మల్ని చూస్తుంటే చదువుకునే పిల్లల్లా ఉన్నారు. స్కూలుకి వెళ్లకుండా ఇలా రోజూ పార్కుకి వచ్చి ఆటలాడుకుంటున్నారు ఎందుకు? అమూల్యమైన సమయాన్ని, జీవితాన్ని ఎందుకు పాడుచేసుకుంటున్నారు?” అన్నాడు.

“మేం జీవితాన్ని పాడు చేసుకోవడం లేదు. జల్సా చేస్తున్నాం” అన్నాడు గోపీ.

“జల్సా చేసుకోవడమంటే స్కూలు మానేసి ఇలా పార్కులవెంట సోమరిపోతుల్లా తిరుగుతూ తల్లిదండ్రులను మోసం చేయడమా? ఒక విధంగా మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటున్నారు” అన్నాడు తాత.

“ఇందులో మోసం చేసుకోవడం ఏముంది? మాకెవరికీ చదువుకోవాల్సిన అవసరం లేదు. ఆ విషయం ఇంట్లో చెప్తే అమ్మానాన్నలు కొడతారు. అందుకే ఇలా చేస్తున్నాం” అన్నారు ముగ్గురూ.

“మరి చదువుకోకపోతే ఎలా బతుకుతారు? ఉద్యోగం ఎలా వస్తుంది?” అన్నాడు తాత.

“భలేవాడివి తాతా! అసలు ఉద్యోగం చేయాల్సిన అవసరం మాకేంటి? మేమంతా కోటీశ్వరుల పిల్లలం. తరతరాలు తిన్నా తరగని ఆస్థి వుంది” అన్నాడు గోపీ.

“అదా మీ ధైర్యం! అంటే మీ తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్ము కూర్చుని తింటూ సోమరిపోతుల్లా బతుకుతారన్నమాట” అన్నాడు తాత.

“అవును. అది మా హక్కు!” అన్నారు ముగ్గురూ.

“సరే! నాతో రండి” అని పార్కులో ఓ మూలనున్న ఇసుక దిబ్బ దగ్గరికి తీసుకెళ్లి “ఇదేమిటి?” అని అడిగాడు తాత.

“అది కూడా తెలీదా? ఇసుక దిబ్బ” అన్నారు ఏక కంఠంతో ముగ్గురూ.

“ఇది మీ తల్లిదండ్రులు సంపాదించిన ఆస్థి అనుకోండి! ముగ్గురూ పిడికిళ్లతో ఆ ఇసుకని తెచ్చి ఈ పక్కన పొయ్యండి” అన్నాడు తాత.

వాళ్లకి విషయం అర్థం కాకపోయినా తాత చెప్పినట్టు చేయసాగారు. కొంత సేపటికి ఇసుక మొత్తం అయిపోయింది.

ఇప్పుడు అర్థమైందా? మీ నాన్నలు సంపాదించిన ఆస్థిని రోజూ కొంత తీసి ఖర్చుపెడుతుంటే కొన్నాళ్లకి మొత్తం కరిగిపోతుంది. అప్పుడు రోడ్డునపడి ముష్టి బతుకు బతకాలి” అని చెప్పాడు తాత.

“మమ్మల్ని క్షమించు తాతా!” అన్నారు.

“ఆస్థి అంటే సంపాదించుకునే కరెన్సీ కాదు. నేర్చుకునే విద్య. కూర్చుని తింటే ఎంత సంపదైనా కరిగిపోతుంది. కానీ విద్య పంచే కొద్దీ పెరుగుతుంది. అందుకే తరగని సంపద చదువే” అన్నాడు తాత చిరునవ్వుతో.

- సి.హెచ్. వి.యస్. బ్రహ్మానందరావు

కాపీ పేస్ట్ కళాఖండాలు

వావ్! ఏం సుమాలు? ఏం సీతాకోకచిలుకలు? రంగురంగుల రెక్కలతో ఎంతగా మైమరపిస్తున్నాయో! వీటి దుంప తెగ! అందమంటే వీటిదే కదా! అనుకుంటున్నారా... అయితే ఫొటోలో కాలేసినట్టే. ఎందుకంటే ఇవి నిజమైన పూలు కావు. అసలు సిసలు సీతాకోకచిలుకలూ కావు. ఇందులో వున్నవారంతా అమ్మాయిలే. కావాలంటే బాగా దగ్గరగా పరిశీలించండి. మీరే అవునంటారు. ఇంతకీ ఈ అద్భుత సృష్టి ఎవరిదంటారా! సిసిలియా వెబర్ ది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ దగ్గర బుల్లి గ్రామం ఈమెది. ప్రకృతి అంటే ప్రాణమిచ్చే వెబర్ కెమెరాను చేపట్టింది. తనకు నచ్చిన దృశ్యాన్ని, వస్తువును, ప్రాణిని కెమెరా కళ్లతో బంధించేది. కానీ ఆ పని అందరూ చేసేదేగా. తను కొత్తగా చేసేదేముంది? అనుకుంది. ఫిమేల్ మోడల్ ఫొటోలను కంప్యూటర్‌కెక్కించి కాపీ పేస్ట్ చేసేది. అవసరమైన చోట రంగులు మార్చేది.

అలా రూపొందినవే ఈ సుమాలు.
సీతాకోకచిలుకలు.
ఇప్పుడేమంటారు!
'వారెవా వెబర్' అనా!!